


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


## బండ్ల గణేశ్ కుమార్తె వివాహం... ఏపీ మంత్రి నారా లోకేశ్ కు ఆహ్వానం




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 188 | మంగళవారం 14- 07 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028




## ప్రియాంక గాంధీ ఎక్కడ?

### వయనాడ్ దుర్ఘటన నేపథ్యంలో బీజేపీ విమర్శలు

వయనాడ్‌లో ఇటీవల విరిగిపడ్డ కొండచరియలు

ఎనిమిది మంది మృతి

స్థానిక ఎంపీ ప్రియాంక ఇప్పటి వరకు ఘటనా స్థలాన్ని పరిశీలించలేదని బీజేపీ విమర్శలు

బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వలేదంటూ మండిపాటు

కాంగ్రెస్‌కు వయనాడ్ రాజకీయ పావుగా మారిందని విమర్శ

## బ్యాంకాక్ పబ్‌లో ఘోర అగ్నిప్రమాదం..

### 27 మంది మృతి

మరో 63 మందికి తీవ్ర గాయాలు..

22 మంది పరిస్థితి విషమం

దట్టమైన పొగ కారణంగా ఊపిరాడకే ఎక్కువ మంది మృతి

ఫైర్ ఎగ్జిట్ వద్ద అడ్డంకుల వల్లే భారీగా ప్రాణనష్టం

షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా



ధవళేశ్వరం బ్యూరో చీఫ్ జూలై 13 నంది పత్రిక

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

2 ఏళ్లల్లో ఇరిగేషన్ రంగానికి రూ.24 వేలకోట్లు ఖర్చు

ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు

డబ్బులిచ్చి మరీ గొడ్డలి పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది - పవన్ ను అవమానిస్తున్నారు... వాళ్ల కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు - పిచ్చుకలంకలో రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు - ధవళేశ్వరం బ్యారేజీకి రూ.153 కోట్లతో 117 కొత్త గేట్ల ఏర్పాటు పనులు ప్రారంభించిన ముఖ్యమంత్రి



గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ. 152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని




## మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు...

### ఏ ముఖం పెట్టుకుని పరామర్శిస్తారు?



పరామర్శల పేరుతో జగన్ దొంగ నాటకాలు ఆడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శ

విశాఖ పడవ ప్రమాద బాధితులకు 72 గంటల్లోనే రూ.10 లక్షల సాయం అందించిన ప్రభుత్వం

వైసీపీ హయాంలో 63 మత్స్యకార కుటుంబాలను పట్టించుకోలేదని ఆరోపణ

వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంచి అందించిన కూటమి సర్కార్

జువ్వలదిన్నెలో చిచ్చుపెట్టాలని చూస్తే ఊరుకోబోమని జగన్‌కు హెచ్చరిక

ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసి, నట్టేట ముంచి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని పరామర్శల పేరుతో దొంగ నాటకాలు ఆడుతున్నారని వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా

## మేడిగడ్డపై చర్చకు సిద్ధమా?

మంత్రి ఉత్తమ్‌కు జగదీశ్ రెడ్డి సవాల్



తెలంగాణలోని కాంగ్రెస్ ఒక 'హైబ్రిడ్ కాంగ్రెస్' అని జగదీశ్ రెడ్డి విమర్శ

కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి దిగజారిందని ఆరోపణ

మేడిగడ్డపై సూచనలిచ్చిన ఇంజనీర్లను సీఎం బెదిరించారని ఫైర్

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి బీజేపీ ఏ విధంగా అన్యాయం చేస్తోందో, కాంగ్రెస్ సైతం అదే బాటలో పయనిస్తోందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని ఆయన 'హైబ్రిడ్ కాంగ్రెస్'గా అభివర్ణించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో

## బద్రీనాథ్ విరాళాల దుర్వినియోగం కేసు..



కనిపించకుండా పోయిన కీలకమైన 32 రోజుల సీసీటీవీ ఫుటేజీ

ఆ వీడియోలను తిరిగి పొందేందుకు సాంకేతిక నిపుణుల ప్రయత్నాలు

దర్యాప్తు కమిటీ విచారణ పూర్తి చేసి దేవస్థానం సీఈఓకు 18 పేజీల నివేదిక

దుర్వినియోగం ఒక్కసారి కాదు, పలుమార్లు జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి

జులై 2 నాటి వీడియోలో నిందితుడు డబ్బు దుర్వినియోగం చేస్తున్న దృశ్యాలు

ఆ ఘటనకు ముందు 14 రోజుల ఫుటేజీలో కూడా కొన్ని కీలక ఆధారాలు

శ్రీ బద్రీనాథ్ ధామ్‌లో భక్తుల విరాళాల దుర్వినియోగం కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్



ముంబైలో పవన్ కుడి భుజానికి శస్త్రచికిత్స

మూడు వారాల పాటు ఫిజియోథెరపీ అవసరమన్న వైద్యులు - ఆదివారం పవన్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి ఫడ్నవీస్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని కోకిలాబెన్

## భోగాపురం విమానాశ్రయానికి గుడ్ న్యూస్..

### అంతర్జాతీయ విమానాల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్..



ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్-2025' పరిధిలోకి భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుని తీసుకొచ్చింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అధికారిక గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో భోగాపురం విమానాశ్రయం నుంచి నేరుగా అంతర్జాతీయ విమానాల

## వియత్నాం బోటు ప్రమాదం: 15 మంది భారతీయుల మృతదేహాలు ముంబైకి తరలింపు



# నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

రంగారెడ్డి జిల్లా పెంజర్ల పొలాల్లో మృతదేహం

స్థానికుల సమాచారంతో రాజ్‌కుమార్ గుర్తింపు

మృతదేహం పక్క పాయిజన్ బాటిల్ లభ్యం

శవం పక్కనే ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

హత్యకు ముందు వీడియో కాల్ రికార్డు చేసిన హంతకుడు

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్‌కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్‌కుమార్‌గా నిర్ధారించారు. మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఓ బాలికను వేధించిన వ్యవహారంలో తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు.



# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత







అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్ట్రన్, సెంట్రల్, వెస్ట్రన్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.32 కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117 కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని... కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి తెలిపారు.పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాంఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని సీఎం విమర్శించారు. 2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తిచేయగా, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని... అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపడుతోందని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు. మైక్రో ఇరిగేషన్ విస్తరించడంతో ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాయని, పరిశ్రమలకు నీటి సరఫరా సాధ్యమై కియా వంటి భారీ పరిశ్రమలు రాయలసీమకు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.కూటమిపై గోదావరి జిల్లాల ప్రజల అభిమానం తరగనిదిగోదావరి ప్రజలు అభివృద్ధిని ఆదరించే స్వభావం కలవారని, గతంలోనూ టీడీపీకి అపూర్వ ఆదరణ ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన భారీ విజయాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చిన ఆశీర్వాదంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారం, భగవంతుడి ఆశీస్సులతో ఆర్థిక సవాళ్లను అధిగమించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పుష్కర ఘాట్ల అభివృద్ధితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.1,200 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. పిచ్చుకలంక, బొబ్బర్లంక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని, కోనసీమకు రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. కోవ్వూరులో కోకో సిటీ ఏర్పాటు చేయనున్నట్లు కూడా ప్రకటించారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, మెట్ట ప్రాంతాల్లో పామాయిల్, కోకో సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని చెప్పారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో శాస్త్రీయ విధానాలు అనుసరించాలని సీఎం సూచించారు.అభివృద్ధి-సంక్షేమమే కూటమి లక్ష్యంరాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై రాజీపడబోమని సీఎం హెచ్చరించారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గంజాయిని ప్రోత్సహించే వారిపైనా, మహిళలను కించపరిచే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీలతో, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ లను మించి గొడ్డలి పార్టీతోనే సమస్యలు సృష్టిస్తోందని సీఎం మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని...

ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ... గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని... వారికి డబ్బులిచ్చి ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## బద్రీనాథ్ విరాళాల దుర్వినియోగం కేసు..

ఈ కేసులో అత్యంత ముఖ్యమైన ఆధారంగా భావిస్తున్న 32 రోజుల సీసీటీవీ ఫుటేజీ కనిపించకుండా పోయినట్లు వెల్లడైంది. తొలుత 45 రోజుల వీడియో రికార్డింగ్‌ను భద్రపరిచినట్లు అధికారులు తెలిపినా.. దర్యాప్తు బృందానికి అందులో 32 రోజుల ఫుటేజీ అందలేదని సమాచారం. ప్రస్తుతం ఆ వీడియోలను తిరిగి పొందేందుకు సాంకేతిక నిపుణులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఘటనపై ఏర్పాటు చేసిన నాలుగు మంది సభ్యుల దర్యాప్తు కమిటీ విచారణ పూర్తి చేసి దేవస్థానం సీఈఓకు 18 పేజీల నివేదిక సమర్పించింది. ప్రాథమిక విచారణలో భక్తుల విరాళాలు, విలువైన వస్తువుల దుర్వినియోగం ఒక్కసారి కాదు, పలుమార్లు జరిగినట్లు గుర్తించినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విరాళాల లెక్కింపు గదిలో మరిన్ని సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఆలయ ప్రదక్షిణ మార్గంలోని 'బ్లైండ్ స్పాట్స్' అన్నింటినీ నిఘా పరిధిలోకి తీసుకురావాలని కమిటీ సూచించింది. ఘటనకు కేవలం 14 రోజుల ముందు సీసీటీవీ ఫుటేజీ మాత్రమే లభించినట్లు తెలిసింది. గతంలో ఏర్పాటు చేసిన కెమెరాల స్టోరేజ్ సామర్థ్యం కేవలం 15 రోజులకే పరిమితమై ఉండటంతో పాత రికార్డులు అందుబాటులో లేకపోయాయి. జులై 2 నాటి వీడియోలో నిందితుడు డబ్బు దుర్వినియోగం చేస్తున్న దృశ్యాలు కనిపించినట్లు అధికారులు గుర్తించారు. అలాగే ఆ ఘటనకు ముందు 14 రోజుల ఫుటేజీలో కూడా కొన్ని కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. ఈ కేసులో పారదర్శకత కోసం జులై 7న శ్రీ బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ఛైర్మన్ కార్యాలయంలో వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న ప్రమోద్ నౌటియాల్‌ను సస్పెండ్ చేసింది. విధుల నిర్వహణలో తీవ్ర అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా తేలడంతో ఆయనకు ముందుగా షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం కమిటీ నిర్వహించిన విచారణలో ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు గుర్తించడంతో తదుపరి చర్యలు చేపట్టింది.

## భోగాపురం విమానాశ్రయానికి గుడ్ న్యూస్..

రాకపోకలకు చట్టపరమైన మార్గం సుగమమైంది. కేంద్ర హోంశాఖ ఉత్తర్వుల ప్రకారం కేటగిరీ-1 విమానాశ్రయాల జాబితాలో భోగాపురం 39వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ గుర్తింపుతో విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్, విదేశీయుల ప్రవేశ, నిష్క్రమణకు సంబంధించిన అన్ని ప్రక్రియలను అధికారికంగా నిర్వహించే అవకాశం కలిగింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత విదేశాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రజలకు అంతర్జాతీయ ప్రయాణాలు మరింత సులభం కానున్నాయి. అలాగే పర్యాటకం, ఐటీ, పారిశ్రామిక రంగాలతో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలోనూ ఈ నిర్ణయం కీలక పాత్ర పోషించనుందని అధికారులు భావిస్తున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం ప్రధాన కేంద్రంగా మారనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఆ ప్రాంత అభివృద్ధికి మరో మైలురాయిగా నిలవనుంది. విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత అంతర్జాతీయ కనెక్టివిటీ పెరగడంతో పాటు వాణిజ్య, ఉపాధి అవకాశాలూ గణనీయంగా విస్తరించే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, తాజా ఉత్తర్వులు హోంశాఖ అదనపు కార్యదర్శి నితేశ్ కుమార్ వ్యాస్ పేరిట జారీ అయ్యాయి.

## వియత్నాం బోటు ప్రమాదం: 15 మంది భారతీయుల మృతదేహాలు ముంబైకి తరలింపు

వియత్నాంలోని ఫుక్వోక్ ద్వీపం సమీపంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మరణించిన 15 మంది భారతీయుల మృతదేహాలను స్వదేశానికి తరలిస్తున్నారు. హో చి మిన్ సిటీ నుంచి వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానంలో వారి మృతదేహాలు సోమవారం సాయంత్రానికి ముంబై చేరుకుంటాయని హనోయిలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. ముంబైకి చేరుకున్న తర్వాత మృతదేహాలను వారి వారి స్వస్థలాలకు పంపేందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. మృతుల్లో అత్యధికంగా తమిళనాడుకు చెందిన 17 మంది ఉండగా, మిగిలిన వారు ఆంధ్రప్రదేశ్ (3), తెలంగాణ, కేరళ రాష్ట్రాల వారని ప్రాథమిక సమాచారం. ఈ ప్రమాదంలో గాయపడి ఫుక్వోక్‌లో చికిత్స పొందుతున్న మరో భారతీయ పౌరుడికి ఆదివారం సాయంత్రం వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. మెరుగైన చికిత్స కోసం అతడిని సోమవారం హో చి మిన్ సిటీలోని ఆసుపత్రికి తరలించారు. అతడి కుటుంబ సభ్యులు కూడా వియత్నాం చేరుకున్నారు.

## నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

తొలుత బాలిక తల్లి, నానమ్మలను కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్-బెంగళూరు హైవేల్లోని హోటళ్లు, లాడ్జీలు, దాబాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబసభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతికి ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. మృతదేహం పక్కన ఉన్న అతడి మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. రాజ్‌కుమార్‌కు బెట్టింగ్ అలవాటు ఉందని.. దీనికోసం 16 సిమ్‌లు వినియోగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల బాధతో జీవితంపై విరక్తి కలిగిందని.. ఓ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయానని సెల్ఫీ వీడియోలో రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. 2.26 సెకన్ల నిడివి గల ఈ వీడియోను మీడియా ప్రతినిధులకు సీపీ చూపించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీడియో రికార్డు చేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో బాలిక సహా ఆరుగురిని అత్యంత దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ కేసు హంతకుడు రాజ్‌కుమార్ మృతదేహం అతని మేనమామ ఊరు కొత్తూరు మండలం పంజర్లలో లభ్యమైనట్లు చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు సమీపంలోని ఓ వెంచర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ మృతదేహం రాజ్‌కుమార్‌దేనని డీసీపీ ధ్రువీకరించారు. రాజ్‌కుమార్ పాయిజన్ సేవించి ఆత్మహత్య చేసుకున్నాడని డీసీపీ పేర్కొన్నారు. ఘటనాస్థలిలో పాయిజన్ బాటిల్ లభ్యమైందని తెలిపారు. ఆ ఆధారాలను సేకరించిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. కాగా, షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడి కోసం

**పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా,**
**ఈరోజు అతడి మృతదేహం లభ్యమైంది.**

సంచలనం సృష్టించిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్‌కు సంబంధించిన పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జూన్ 12న పోక్సో కేసులో కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో అతడు కోర్టులో చేసిన వాదనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. బెయిల్ విచారణ సందర్భంగా.. తనపై నమోదైన పోక్సో కేసు తప్పుడు కేసు అని రాజ్‌కుమార్ కోర్టుకు తెలిపినట్లు సమాచారం. బాధిత బాలిక తండ్రి తన వద్ద అప్పు చేశాడని, ఆ డబ్బులు తిరిగి అడిగినందుకే తనపై కేసు పెట్టారని వాదించాడు. ఫిర్యాదు చేసిన రోజు తాను అక్కడే లేనని, ఆ సమయంలో భార్యతో కలిసి ఆస్పత్రికి వెళ్లినట్లు కోర్టులో తెలిపాడు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం.. మైనర్ బాలికకు సంబంధించిన కేసు నమోదైన తర్వాత రాజ్‌కుమార్ కుటుంబంలో విభేదాలు మరింత పెరిగాయి. ఈ వ్యవహారం తర్వాత అతడి భార్య సరిత విడాకులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఇదే విషయంపై రాజ్‌కుమార్ తీవ్ర ఆగ్రహానికి గురై, పలుమార్లు సరితను చంపేస్తానని బెదిరించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. పోలీసుల దర్యాప్తు ప్రకారం.. హత్యలకు ముందు రాజ్‌కుమార్ సాధారణంగానే వ్యవహరించినట్లు గుర్తించారు. ఘటనకు కొన్ని గంటల ముందు తన కుమారుడితో కలిసి బయటకు వెళ్లి ఆడించడంతో పాటు హెయిర్ కటింగ్ కూడా చేయించినట్లు సమాచారం. అదే రోజు ఉత్సాహంగా ఇంటికి వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులపై దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## ప్రియాంక గాంధీ ఎక్కడ?

కేరళలోని వయనాడ్ జిల్లాలో ఇటీవల కొండచరియలు విరిగిపడ్డ నేపథ్యంలో స్థానిక ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ప్రమాదం జరిగిన తర్వాత ఆమె ఇప్పటివరకు బాధిత ప్రాంతాన్ని సందర్శించలేదని ఆరోపించింది. మృతుల కుటుంబాలను కూడా పరామర్శించలేదని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ అన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం తప్ప బాధితులకు ఆమె ఏమాత్రం అండగా నిలవలేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు వయనాడ్ కేవలం రాజకీయ పావుగా మారిందని కేశవన్ వ్యాఖ్యానించారు. గతంలో ఎంపీగా ఉన్న రాహుల్ గాంధీ కూడా నియోజకవర్గంపై పెద్దగా దృష్టి పెట్టలేదన్నారు. రాయ్‌బరేలీ నుంచి పోటీ చేసి వయనాడ్ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఇప్పుడు అదే రాజకీయ శైలి ప్రియాంక గాంధీ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. జులై 7న వయనాడ్ జిల్లా అనక్కంపోయిల్-మెప్పాడి ట్విన్ ట్యూబ్ టన్నెల్ ప్రాజెక్టు పనులు జరుగుతున్న కల్లాడి ప్రాంతంలో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారి కోసం ఐదు రోజుల పాటు గాలింపు చర్యలు కొనసాగాయి. చివరగా విక్రమ్ రాణా మృతదేహాన్ని ఆదివారం సహాయక బృందాలు వెలికితీశాయి. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. చివరి మృతదేహం లభించడంతో ప్రమాద స్థలంలో కొనసాగుతున్న గాలింపు, సహాయక చర్యలను అధికారులు ముగించారు. ఈ ఆపరేషన్‌లో జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ), అగ్నిమాపక శాఖ, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు, అటవీ శాఖ సిబ్బంది, యువజన స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. ఈ ఘటనపై రాజకీయ విమర్శలు కొనసాగుతున్నప్పటికీ, బాధిత కుటుంబాలకు సాయం అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

## బ్యాంకాక్ పబ్‌లో ఘోర అగ్నిప్రమాదం..

థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. నగరంలోని ఓ ప్రముఖ పబ్‌లో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 27 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 63 మంది తీవ్రంగా గాయపడ్డారు. పబ్ ప్రవేశ ద్వారం వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగి, భవనం మొత్తం దట్టమైన పొగ కమ్ముకోవడంతో లోపల ఉన్నవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఉత్తర బ్యాంకాక్‌లోని 'నా లాడ్‌ప్రావ్' పబ్‌లో ఈ దుర్ఘటన జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సుమారు 30 నిమిషాల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద స్థలాన్ని సందర్శించిన బ్యాంకాక్ గవర్నర్ చాడ్‌చార్ట్ సిట్టిపంత్ మాట్లాడుతూ.. మంటలు వేగంగా పైకప్పు వరకు వ్యాపించాయని, దట్టమైన పొగ కారణంగా ఊపిరాడకపోవడమే అధిక మరణాలకు ప్రధాన కారణమని తెలిపారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉందని ఆయన వెల్లడించారు. చాలా మృతదేహాలు పబ్ వెనుక ఉన్న రెస్ట్‌రూమ్‌లలో లభ్యమైనట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర ద్వారం (ఫైర్ ఎగ్జిట్) వద్ద కొన్ని అడ్డంకులు ఉండటంతో, లోపల ఉన్నవారు బయటకు రాలేకపోయారని అధికారులు భావిస్తున్నారు. థాయ్‌లాండ్ ప్రధాని అనుతిన్ చార్న్‌విరాకుల్ ఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఓ మ్యూజీషియన్ ఆయనతో మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి ముందు స్టేజ్ పక్కన ఉన్న సర్క్యూట్ బ్రేకర్ నుంచి పొగలు రావడం చూశానని, ఆ వెంటనే పెద్ద పేలుడు వినిపించిందని వివరించాడు. ఈ ప్రమాదంలో తన బ్యాండ్‌లోని ఒకరు మరణించగా, మరొకరి ఆచూకీ తెలియడం లేదని స్థానిక గాయని సుకన్య వాంగ్‌వాంగ్వాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంటలు వ్యాపించగానే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంతా చీకటిమయమైందని, పొగ వల్ల ఏమీ కనిపించక చాలామంది లోపలే చిక్కుకుపోయారని బాధితులు చెబుతున్నారు. పబ్ యాజమాన్యం భద్రతా నిబంధనలను ఉల్లంఘించిందా అనే కోణంలో అధికారులు సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను ఫడ్నవీస్ సోమవారం కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.పవన్ కల్యాణ్ కుడి భుజానికి శనివారం సుమారు మూడున్నర గంటల పాటు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. 2016లో ఆయన భుజానికి గాయమవగా, ఇటీవలి రాజకీయ పర్యటనల్లో అభిమానులు, కార్యకర్తల తాకిడి కారణంగా ఆ గాయం తీవ్రతరమైంది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్య బృందం వెల్లడించింది. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు ఆసుపత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు పవన్ మూడు వారాల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫడ్నవీస్ పరామర్శ రాజకీయాలకు అతీతంగా నాయకుల మధ్య ఉన్న సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. తనను పరామర్శించినందుకు ఫడ్నవీస్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు..

సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల కడుపు కొట్టి, వారి నోటికాడి కూడు లాక్కున్న జగన్ రెడ్డి.. ఇప్పుడు పెద్ద యోగ్యుడిలా పరామర్శల డ్రామాలు ఆడటం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం సముద్ర తీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంపై ప్రభుత్వం తక్షణం స్పందించిందని కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నేవీ, కోస్ట్ గార్డ్ బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన మత్స్యకారుడు చిన్నా అందించిన సమాచారంతో 72 గంటల పాటు గాలించినా మిగతా ఆరుగురి ఆచూకీ లభించలేదన్నారు. కోస్ట్ గార్డ్, త్రీ-మెన్ కమిటీ నివేదికల ఆధారంగా వారు మరణించినట్లు నిర్ధారించి, కేవలం 72 గంటల వ్యవధిలోనే బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందించామని వివరించారు. భారతదేశ చరిత్రలోనే ఇంత వేగంగా సాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటనను కూడా జగన్ రాజకీయం చేస్తున్నారని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. "ప్రభుత్వం బాధితులకు కొండంత ధైర్యాన్నిస్తే.. మీరు శవ రాజకీయాలు చేయడానికి వెళు_న్నారా?" అని ప్రశ్నించారు. గతంలో వైజాగ్ హార్బర్‌లో 45 బోట్లు కాలి బూడిదైతే కనీసం పలకరించని జగన్, ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తన ఐదేళ్ల పాలనలో 63 మంది మత్స్యకారులు సముద్రంలో గల్లంతై చనిపోతే, వారి కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు కూడా ఇప్పించలేని దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి జగన్ అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ 63 కుటుంబాలకు రూ. 3.15 కోట్ల సాయం అందించి ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు అండగా నిలుస్తోందని రవీంద్ర వివరించారు. వేట నిషేధ భృతిని ఏకంగా రూ. 20,000కి పెంచి, రూ. 258 కోట్లకు పైగా నిధులను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. మత్స్యకారుల చెరువుల హక్కులను కాలరాసేందుకు జగన్ తెచ్చిన దుర్మార్గపు జీవో నెం. 217ను రద్దు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకుండా నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. గతంలో హుద్‌హుద్ తుపాను సమయంలో చంద్రబాబు దెబ్బతిన్న బోట్లకు రూ. 6 లక్షల చొప్పున సాయం అందించారని, వేలమంది ఆక్వా రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. మత్స్యకారుల రక్షణ కోసం 4,560 శాటిలైట్ ట్రాన్స్‌పాండర్లను ఉచితంగా అందించామని, 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని తెలిపారు. జువ్వలదిన్నె వంటి చోట్ల కులాల మధ్య చిచ్చులు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు ఏం చేశారో దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. మత్స్యకారులకు ఏ మేలు జరిగినా అది తెలుగుదేశం, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## కాళేశ్వరంపై కాంగ్రెస్-బీజేపీ కుమ్మక్కు..

కుమ్మక్కయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ఆరోపించారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో, గోదావరి జలాలను ఉద్దేశపూర్వకంగానే సముద్రం పాలు చేస్తూ రైతులను ఇబ్బందుల్లోకి నెడుతున్నారని ఆయన మండిపడ్డారు.

# ప్రజలకు అవగాహన చేయకుండా “ సర్ “ప్రక్రియ ముగుస్తున్నానడం దుర్మార్గం

**-పట్టణ గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించి “సర్ “ప్రక్రియ 3 నెలలు పొడిగించాలి-సిపిఐ**

నంద్యాల ప్రతినిధి. జూలై 13 . (నంది పత్రిక ):రాష్ట్రంలో ప్రజలకు గ్రామసభలు వార్డు సభలు నిర్వహించకుండా అవగాహన కల్పించకుండా ఎన్నికల అధికారులు ఈనెల 14 వ తేదీ“సర్“ ప్రక్రియ ముగిస్తుందని ప్రజలకు తెలపడం దుర్మార్గమని ప్రజలకు అవగాహన కల్పించి మరో 3 నెలలు గడువు పెంచాలని సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం జిల్లా కలెక్టర్ రాజకు మారి గణియాకి డిమాండ్స్ కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలోసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి నాగరాముడు.. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న.సిపిఐ జిల్లా సమితి సభ్యులు డి శ్రీనివాసులు పట్టణ సహాయ కార్యదర్శి భూముని శ్రీనివాసులు. సిపిఐ నాయకులు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 70/శాతం ఓట్లు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని ఎన్నికల అధికారులు. సర్ ప్రక్రియ పై బి ఎల్ వో లకు అవగాహన కల్పించిగ్రామ సభలు నిర్వహించి ప్రజలకు కూడా అవగాహన కల్పించాల్సి ఉండగా అలాంటి ప్రక్రియ ఎక్కడ జరగకపోగా ఈనెల 14తో గడువు ముగిస్తుందని చెప్పడం దుర్మార్గమని జిల్లా కలెక్టర్. ఎన్నికల అధికారులు స్పందించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం. చేపట్టేందుకు కృషి చేయాలని సర్ ప్రక్రియ పూర్తి అయ్యే నాటికి ఓట్లు తొలగించే కార్యక్రమం జరుగుతుందని విమర్శించారు.ఎన్నికల అధికారులు సర్ లో చని పోయిన వారివి , విదేశాల నుండి వచ్చిన వారి ఓట్లు తొలగిస్తే అభ్యంత్రం లేదు గాని సర్ పేరుతొ అధికార పార్టీ వారికి బీజేపీ కి వ్యతిరేకంగా ఉండే నిజమైన ఓటర్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఓటు నమోదుకు గతంలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు పాస్ పోర్ట్ ప్రామాణికంగా ఉండేవాని ఇప్పుడు అవేమి పనికి రావంటున్నారు.బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ సభ్యత్వం కార్డులు మాత్రమే ప్రామాణికమా అని ప్రశ్నించారు.నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎన్నికల అధికారులు 100% ఫారాలు ఇచ్చామని వాటిలో ఇప్పటివరకు 70 శాతం ఓట్లు మాత్రమే ఆన్లైన్ అయినావని నంద్యాల పట్టణంలోని మిగిలిన ఓట్లు మూడు రోజుల్లోనే ఎంతవరకు ఆన్లైన్ అవుతాయని నమ్మకం లేదని వీటిలో అరులైన ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉంది కావున జిల్లా కలెక్టర్ ఉన్నత అధికారులు రాష్ట్ర ఎన్నికల సంఘం నుండి గడువు పొడిగించేందుకు అనుమతులు తీసుకోవాలని పై నాయకులు అధికారులను కోరారు.



# ఆడిట్ అధికారుల నిర్లక్షం..

## మున్సిపల్ కాంట్రాక్టర్లకు ఇబ్బందులు.

**2 కోట్ల బిల్లులు ఎక్కించని అడిట్ అధికారులు.**
**నెలరోజులుగా అడిట్ అధికారులు ఏమిచేస్తున్నారు.**
**5శాతం లంచం ఇవ్వకపోతే బిల్లులు ఎక్కించరా.**
**రేపు అడిట్ కార్యాలయం వద్ద ధర్నాకు సిద్ధమైన కాంట్రాక్టర్లు.**

నంద్యాల సిటీ బ్యూరో జులై 13 ( నంది పత్రిక ) కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీలో పనిచేసిన కాంట్రాక్టర్లకు పని అయిపోయిన వెంటనే బిల్లులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది.ప్రభుత్వ ఆదేశాలను అడిట్ అధికారులు తుంగలో తొక్కుతున్నారు.అడిట్ అధికారులు నిర్లక్ష్యంతో మున్సిపల్ కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు.అడిట్ అధికారులు నిర్లక్ష్యానికి రేపు మున్సిపల్ కాంట్రాక్టర్లు అందరూ అడిట్ కార్యాలయం వద్ద ధర్నాకు సిద్ధం అవుతున్నారు.నెలరోజులుగా వర్క్ బిల్లులు,సి.బిల్లులు ఎక్కించకుండా ఉండటానికి కారణం వారు ఆశించిన లంచం ఇవ్వకపోవడమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.వివరాల్లోకి వెళితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిపై దృష్టిపెట్టింది. కార్పొరేషన్,మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే కాంట్రాక్టర్లకు పనులు చేసిన వెంటనే బిల్లులు ఇస్తే అభివృద్ధి జరుగుతుందని గ్రహించారు.ప్రభుత్వం వెంటనే ప్రతి నెల 11 నుంచి 20 వ తేదీ లోపల పనులు చేసిన వారి బిల్లులు అదే నెల చివరిరోజుల్లో బిల్లులు ఇచ్చేవిధంగా ఆదేశాలు ఇచ్చింది.మున్సిపల్ కాంట్రాక్టర్లు కోట్లాది రూపాయల పాత బకాయిలు ఉన్న కొత్త పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తున్నాయని కొందరు కాంట్రాక్టర్లు పనులు చేశారు.గత నెల నుంచి వర్క్ బిల్లులు,సి.బిల్లులు దాదాపు 2 కోట్ల బిల్లులు అడిట్ అధికారులు ఎక్కించకపోవడంతో కాంట్రాక్టర్లకు డబ్బులు రాలేదు.నాణ్యానికి ఒక వైపు అనుకున్న వారికి రెండవ వైపు చూస్తే గతంలో బిల్లులు ఒకే చేయడానికి 3 శాతం లంచం ఇస్తే కానీ బిల్లులు ఒకే అయ్యేవి కావు అన్నది నగ్నసత్యం.గతంలో కూడా మున్సిపల్ కాంట్రాక్టర్ల బిల్లులు ఎక్కించకపోవడంతో అడిట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడంతో ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించారు.ఈ నేపధ్యంలోనే కొందరు కాంట్రాక్టర్లు అడిట్ కార్యాలయం వద్ద కు వెళ్లి ప్రశ్నిస్తే అధికారులు కొత్తగా వచ్చారని కుంటి సాకులు చెపుతున్నారని ఆరోపిస్తున్నారు.అడిట్ కార్యాలయంలో పనిచేసేవారికి కొత్తా,పాత అని ఉంటుందా అని ప్రశ్నిస్తున్నారు.అడిట్ అధికారులు మున్సిపల్ అధికారుల జీతాలు మాత్రం ఎక్కించి,కాంట్రాక్టర్ల బిల్లులు ఎక్కించకపోవడం మతలబ్ అందరికీ తెలిసిన విషయమే.వాస్తవానికి మున్సిపల్ కాంట్రాక్టర్లు వారు చేసిన పనికి బిల్లులు ఎక్కించాలంటే 3 శాతం లంచం ఇచ్చేవారు,కొత్త వారు వచ్చారు కదా వారు 5 శాతం లంచం అడగడం,కాంట్రాక్టర్లు ఇవ్వకపోవడం వల్లే బిల్లులు ఎక్కించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రతి సారి అడిట్ అధికారులు వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం అందుకే రేపు ఉదయం 12 గంటలకు అడిట్ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది. మున్సిపల్ అధికారులకు జీతాలపై ఉన్న శ్రద్ధ కోట్లు పెట్టుబడి పెట్టీ అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల బిల్లులు వచ్చే విధంగా చూడకపోవడం విశేషం.అభివృద్ధి జరిగినా జరగకపోయినా మా జీతాలు వస్తె చాలు అనుకుంటున్న మున్సిపల్ అధికారులు.గత నెలతో పాటు ఈ నెలకూడా బిల్లులు వస్తాయో లేదో అని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు.మున్సిపల్ కాంట్రాక్టర్లకు న్యాయం జరుగుతుందని ఆశిద్దాం.




# నంద్యాలలో రూ. 50 లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ పనులకు భూమి పూజ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్





నంద్యాల సిటీ బ్యూరో జూలై 13 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఈ క్రమంలో, నంద్యాల పట్టణంలోని పలు వార్డుల్లో నూతన డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఈరోజు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నంద్యాల ఒకటో వార్డు పరిధిలోని పివి నగర్ నందు ఉన్న స్వర్గదామం సమీపంలో మరియు 21వ వార్డులో నూతన డ్రైనేజీల నిర్మాణానికి సుమారు రూ. 50 లక్షల రూపాయల నిధులను కేటాయించారు. భూమి పూజ అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ మరియు పట్టణ పరిశుభ్రత దృష్ట్యా ఈ డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం నాణ్యమైన పనులను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, మధుసూదన్ , పిచికే సుమలత, పబ్బతి వేణు, గురు ప్రసాద్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నంద్యాల నవ నిర్మాణ సమితి ప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





# ఘటం బిందెల ముక్కులు తీర్చుకుంటున్న భక్తులు..

అవనిగడ్డ, దివిసీమకు కొంగుబంగారమై కోరిన కోరికలు తీర్చి కల్పవల్లిగా విరాజిల్లుతున్న గ్రామ దేవత లంకమ్మ అమ్మవారికి ఘటం బిందె మొక్కుబడులు కోలాహలంగా పెద్ద ఎత్తు చెల్లించుకుంటున్నారు. ఆలయ అభివృద్ధి పనులు సెరవేగంగా జరుగుతున్నాయి. గత ఏడు నెలల గా నూతన పాలకవర్గం లో ఆలయ అభివృద్ధి కోసం శ్రమిస్తూ ఆలయ ఆవరణ లో ఆలయ కార్యాలయము, గుడికి ఇరువైపులా ప్రహరీ గోడ నిర్మాణం, అమ్మవారి రూపాలు, కళ్యాణం మండపం, విశ్రాంతిభవనం ఏర్పాటు వంటి పనులు లలో పాలకవర్గం బిజీగా ఉంది. నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివచ్చి ఘటం బిందెలు నెత్తిన పెట్టుకుని మెడలో గార్ల దండ గులాం చల్లుకుంటూ డప్పు కోలాటా లుకు అనుగుణంగా, నృత్యాలును చేసుకుంటూ మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది భక్తులకు కావలసిన ఏర్పాటను ఆలయ చైర్మన్ అన్నపురెడ్డి వెంకటస్వామి, కార్యనిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాస్ ( వాసు) లు పర్యవేక్షించారు.



# ప్రజా ఆస్తుల పరిరక్షణకై జులై 25న నంద్యాలలో మహా సత్యాగ్రహ దీక్ష

**రైతుల మార్కెట్ యార్డు భూములను రాజకీయ పార్టీ కార్యాలయాలకు కేటాయించడంపై తీవ్ర ఆందోళన**
**వ్యవసాయ పరిశోధన స్థానం భవితవ్యానికి తూట్లు పొడుస్తున్న ప్రభుత్వం**
**ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పదివేల కుటుంబాలను ప్రత్యక్షంగా కలిసే కార్యాచరణకు అఖిలపక్ష ఐక్యవేదిక నిర్ణయం**



నంద్యాల సిటీ బ్యూరో జులై 13 ( నంది పత్రిక ) ప్రజల ఆహార భద్రతకు అత్యంత కీలకమైన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లో ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని తరలించడానికి ప్రభుత్వ స్థలాలు లేవని చెప్పే ప్రభుత్వం, రాజకీయ పార్టీల అవసరాల కోసం మాత్రం కోట్ల రూపాయల విలువైన ప్రజా ఆస్తులను కారుచౌకగా కేటాయించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అఖిలపక్ష ఐక్యవేదిక విమర్శించింది. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జులై 25 (శనివారం) ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు నంద్యాల టెక్కె మార్కెట్ యార్డ్ వద్ద మహా సత్యాగ్రహ దీక్ష నిర్వహించాలని సోమవారం నంద్యాలలో అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా సత్యాగ్రహానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, నూనెపల్లె మార్కెట్ యార్డులో సుమారు రూ.60 కోట్ల విలువైన రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణానికి ఏడాదికి కేవలం రూ.1,000 లీజుతో 33 సంవత్సరాలకు కేటాయించడం రైతుల ప్రయోజనాలను కాలరాసే చర్య అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ఆస్తులను రాజకీయ అవసరాలకు వినియోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. అలాగే 120 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం రాయలసీమ వ్యవసాయాభివృద్ధికి విశేష సేవలు అందించిందని, అలాంటి పరిశోధన సంస్థను తాత్కాలిక కలెక్టరేట్ పేరుతో బలహీనపరచడం నంద్యాల వ్యవసాయ భవిష్యత్తుకే కాకుండా దేశ ఆహార భద్రతకూ ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే కలెక్టరేట్‌ను తరలిస్తామని ఇచ్చిన హామీని రెండున్నర సంవత్సరాలైనా అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు.

**ఇంటింటికీ ప్రచారం... పదివేల కుటుంబాల మద్దతే లక్ష్యం** మహా సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయడానికి ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కలిసి 100 బృందాలుగా ఏర్పడి, ప్రతి బృందం నేటి నుండి సత్యాగ్రహం జరిగే 25 వరకు 10 రోజులపాటు ప్రతిరోజూ కనీసం 10 కుటుంబాలను ప్రత్యక్షంగా కలుస్తూ, ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ ప్రచారం ద్వారా పదివేల కుటుంబాలకు చేరుకొని, నూనెపల్లె మార్కెట్ యార్డు భూమి కేటాయింపు, పరిరక్షణ, ప్రజా ఆస్తుల రక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించి, మహా సత్యాగ్రహ దీక్షకు విస్తృత ప్రజా మద్దతును కూడగట్టాలని నిర్ణయించారు.

**సత్యాగ్రహ ప్రధాన డిమాండ్లు** నూనెపల్లె మార్కెట్ యార్డు భూమి కేటాయింపును వెంటనే రద్దు చేయాలి. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని వెంటనే తరలించాలి. రైతు సంక్షేమం కోసం మార్కెట్ యార్డులు, వ్యవసాయ పరిశోధన సంస్థలను బలోపేతం చేయాలి. ప్రజా ఆస్తుల పరిరక్షణ, వ్యవసాయ రంగ పరిరక్షణతోనే రాయలసీమ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటూ, జులై 25న జరిగే మహా సత్యాగ్రహ దీక్షలో రైతులు, మేధావులు, యువత, ప్రజా సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, న్యాయవాది శంకరయ్య, కె.సి. కెనాల్ పరిరక్షణ సమితి నాయకులు బెక్కం రామసుబ్బారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మస్తాన్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజాస్ హుసేన్, క్రిస్టియన్ జేఏసీ నాయకుడు జానయ్య, వెలుగోడు రైతు సంఘం నాయకుడు నస్రుల్లాఖాన్, భాస్కర్ రెడ్డి, పరిరక్షణ నాయకుడు మురళీధర రెడ్డి, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నాయకులు ఆకుమల్ల రహీం, షణ్ముఖరావు,,ాణూఖ విద్యార్థి సంఘం నాయకుడు రాంబాబు, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకుడు చౌడప్ప,జై బసవేశ్వర రైతు సంఘం నాయకుడు ఎం.సి. కొండారెడ్డి, వెల్ఫేర్ పార్టీ నాయకుడు అన్వర్ భాష, వాల్మీకి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న, చిరు వ్యాపారుల సంఘం నాయకుడు సత్యనారాయణ, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు కుమ్మరి ప్రసాద్, గడివేముల మండల రైతు సంఘం కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి, నేపథ్య గాయకులు శివరామిరెడ్డి, నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

# పోలవరం పూర్తికి డెడ్‌లైన్ ఫిక్స్: 2027 మార్చికి జాతికి అంకితం చేస్తామన్న సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అనంతరం అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, ప్రభుత్వ లక్ష్యాలను ఆయన వెల్లడించారు. 2026 ఆగస్టు 14న, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఒకరోజు ముందు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేసి చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుడతామని కీలక ప్రకటన చేశారు. అక్కడ తాను స్వయంగా జలహారతి ఇచ్చి గోదావరి జలాలకు స్వాగతం పలుకుతానని తెలిపారు.

**గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు** ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2019 నాటికి 72 శాతం పనులు తాము పూర్తి చేస్తే, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని ఆరోపించారు.

# జొన్నలు కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆఫీస్ వద్ద రైతులు ధర్నా





**నంద్యాల ప్రతినిధి. జూలై 13 . (నంది పత్రిక ):**సోమవారం గడివేముల మండలానికి చెందిన బిలకల గూడూరు, పెసర వాయి గ్రామాల జొన్న రైతులు మరియు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల వద్ద మొత్తం జొన్నలను కొనుగోలు చేయాలని ధర్నా నిర్వహించారు. గత రెండు నెలల క్రితం నుండి జిల్లాలో మిగిలిపోయిన జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆందోళన చేస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కొనుగోలు చేయడానికి కృషి చేస్తానని గతంలో కలెక్టర్ హామీ ఇచ్చారు. హామీ నెరవేకపోవడంతో ఆగ్రహించిన రైతులు నేడు కలెక్టర్ నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక వద్ద జొన్నల కొనుగోలు సమస్య ను పరిష్కరించే వరకు ఇక్కడి నుండి వెళ్లి లేదని, ప్రభుత్వ నిర్లక్ష్యం తో జొన్నల కొనుగోళ్లుఆలస్యం చేస్తున్నందువల్ల తాముతీవ్రంగా నష్టపోతున్నామని, పండిన జొన్నలు అమ్ముడు పోక, ప్రస్తుతం ఖరీఫ్ లో వేసిన పంటలు వర్షాలు లేక ఎండిపోతున్నవి. మా బాధలు ఇంకెవరితో చెప్పుకోవాలి. మాకు ఆత్మహత్యలు తప్పవు. ప్రభుత్వాలు మమ్మల్ని పట్టించుకోవా? అంటూ ఆగ్రహంతో కలెక్టర్ మరియు జేసీ సమక్షంలోనే తమ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని సివిల్ సప్లై అధికారులు కొనుగోలుకు అనుమతి వచ్చింది, లారీలు పంపుతామని హామీ ఇస్తారు మీరేమో అనుమతి రాలేదంటారు ఎవరిని నమ్మాలి. మా బాధలు ఎవరితో చెప్పుకోవాలి అని రైతులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.రామ చంద్రుడు జిల్లా కలెక్టర్ ని ప్రశ్నించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రైతుల తో మాట్లాడుతూ ఈరోజు ఇప్పుడే కేంద్రప్రభుత్వము నుండి జొన్నలు కొనుగోలు చేయుటకు అనుమతినిస్తూ మెసేజ్ వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి నేడు లేదా రేపు కొనుగోలు ప్రక్రియ మొదలు పెట్టడానికి చర్యలు తీసుకుంటానని, గడివేముల మండల రైతులకే ప్రాధాన్యత ఇస్తానని, రైతులందరికీ సమాచారం మా అధికారుల ద్వారాపంపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిలకల గూడూరు, పెసర వాయి గ్రామాల పెద్దలు రఫీ, రామ పుల్లారెడ్డి, రైతుసంఘాల నాయకులు మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి .రామచంద్రుడు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మన జిల్లాలో 54 వేల ఎకరాల్లో జొన్న పంట సాగైతే 2లక్షల మెట్రిక్ టన్నులకు పైగా జొన్నలు ఉత్పత్తి అయ్యాయని, ప్రభుత్వాలు కేవలం 30 వేల మెట్రిక్ టన్నుల మాత్రమే కొనుగోలు చేసి టార్గెట్ అయిపోయి ందని చెప్పడం చాలా అన్యాయమని,కేంద్రం ప్రకటించిన టార్గెట్ అమలు చేయడం తప్ప, రైతు ప్రభుత్వంగా చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా కేంద్రం నుండి కొనుగోలుకు అనుమతి తీసుక రావటంలో పూర్తి నిర్లక్ష్య వైఖరితో ఉన్నదని, రాష్ట్రం తన వాటాగా కొంతమేరకైనా జొన్నలు కొనడానికి ముందుకు రాకపోవడం సిగ్గుచేటనీ అన్నారు. ఇప్పటికైనాకేంద్రం రాష్ట్రం రెండూ కలిసి రైతుల వద్దవున్న మొత్తం జొన్నలను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, కలెక్టర్ ఇచ్చిన హామీ ప్రకారం వెంటనేకొనుగోలు ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలన్నారు. హామీ అమలు జరగని పక్షంలో మళ్లీ ఆందోళన కొనసాగుతుందని, రేపు ఆళ్లగడ్డలో జరగబోయే విద్యాశాఖ మంత్రి పర్యటనలో కూడా రైతాంగం ప్రశ్నించాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.

# చదరంగం పోటీల్లో శ్రీ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థుల ఘన విజయం.

## రాష్ట్ర స్థాయికి ముగ్గురు ఎంపిక



**నంద్యాల సిటీ బ్యూరో జులై 13 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నంద్యాలలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజ్ వేదికగా నిర్వహించిన "నంద్యాల జిల్లా సీనియర్స్ చెస్ సెలక్షన్స్ ఫర్ స్టేట్ లెవెల్ - 2026" పోటీలలో క్రాంతినగర్‌లోని శ్రీ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. వివిధ విభాగాల్లో పోటీపడిన ఈ విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించడమే కాకుండా, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించి పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు.

**విజేతల వివరాలు:**

**అండర్-15 విభాగం.** ఎస్. శిరీష్ కుమార్ (8వ తరగతి - సి.బి.ఎస్.ఈ): ఈ విభాగంలో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి మొదటి స్థానం (ఫస్ట్ ర్యాంక్) కైవసం చేసుకుని, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

ఎ. జయ్ చౌడేశ్వరి సంతోష్ (9వ తరగతి - స్టేట్ బోర్డ్): గట్టి పోటీనిస్తూ ద్వితీయ స్థానం (సెకండ్ ర్యాంక్) సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

సి. పవన్ కుమార్ రెడ్డి (9వ తరగతి - స్టేట్ బోర్డ్): అత్యుత్తమ ప్రతిభను కనబరిచి నాల్గవ స్థానం (ఫోర్త్ ర్యాంక్) సాధించి మెడల్ గెలుచుకున్నాడు.

**అండర్-13 విభాగం.** కె. యజ్ఞచరణ్ (9వ తరగతి - స్టేట్ బోర్డ్): ఈ విభాగంలో అద్భుతంగా రాణించి తృతీయ స్థానం (థర్డ్ ర్యాంక్) దక్కించుకుని, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

కె. ఓబ్లేష్ (8వ తరగతి - సి.బి.ఎస్.ఈ): చక్కటి ప్రతిభ కనబరిచి ఐదవ స్థానం (ఫిఫ్త్ ర్యాంక్) సాధించి మెడల్ సొంతం చేసుకున్నాడు.

**చైర్మన్ అభినందనలు:** విద్యార్థుల ఈ అద్భుత విజయానికి గానూ శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ ఎస్. సుధాకర్ గారు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇంతటి ఘనవిజయానికి కారకులైన పాఠశాల చెస్ కోచింగ్ స్టాఫ్, నిపుణులు మరియు పీఈటీ బృందాన్ని ఆయన అభినందిస్తూ, రాబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా మన విద్యార్థులు విజయం సాధించి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# నంద్యాల జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలి

**నంద్యాల ప్రతినిధి. జూలై 13 . (నంది పత్రిక ):**ఈనెల 15వ తేదీన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు రానున్న మంత్రి నారా లోకేష్ పర్యటన సందర్భంగా నంద్యాల జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని లేని పక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని డివైఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. స్థానిక నంద్యాల పట్టణంలోని డివైఎఫ్ఐ కార్యాలయంలో డివైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తలు ఏర్పాటుచేసిన విలేకరు సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు పాల్గొని మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ కు యువ నాయకులు టిడిపి మంత్రి నారా లోకేష్ వస్తున్నారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ గా నంద్యాల జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆయనను కోరుతున్నామని యువగలం పాదయాత్రలో నంద్యాల జిల్లాకు ఆయన ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అదేవిధంగా రాయలసీమ ప్రాంతాలలో మరియు నంద్యాల జిల్లాలో చాలామంది ప్రజలు యువతీ యువకులు పనులు లేక వలస వెళ్లడం జరుగుతుంది దీనిలో దృష్టిలో పెట్టుకొని మంత్రి నారా లోకేష్ స్పందించాలని ఈ మధ్యకాలంలో జరిగిన సమావేశంలో కూడా ఆయన రాయలసీమ ప్రాంతాలకు యువగలం పాదయాత్రలో నేను హామీ ఇచ్చానని ఆయన మరొకసారి గుర్తు చేసుకున్నారు. కనుక నంద్యాల జిల్లాకు వస్తున్న సందర్భంగా డివైఎఫ్ఐ గా ఈ ఈ కింది డిమాండ్లను నెరవేర్చాలని మంత్రి నారా లోకేష్ ని కోరుతున్నాం. 1. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి. 2. నంద్యాల జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. 3. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. 4. బనగానపల్లె, బేతంచర్ల ప్రాంతాలలో సున్నపురాయి ఆధారంగా నూతన సిమెంటు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. 5. నంద్యాల జిల్లాలో అనేక రకాల ఖనిజ సంపద ఉంది దీనికి ఉపయోగించి ఖనిజ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి. 6. నంద్యాల జిల్లాలో ఉన్న అడవి సంపదను ఉపయోగించుకొని నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. అలాగే నూతన పేపర్ మిల్లును పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. 7. నంద్యాల జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలి. 8. నంద్యాల జిల్లాలో ప్రభుత్వ ఉచిత కోచింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలి. ఈ డిమాండ్లపై మంత్రి నారా లోకేష్ స్పందించి నంద్యాల జిల్లాకు రావాలని కోరుతున్నామని తెలిపారు. లేని పక్షాన నంద్యాల జిల్లా వ్యాప్తంగా యువతి యువకులను ప్రజలను కలుపుకొని ఆందోళన చేపడుతామని నంద్యాల డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ తెలిపారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి మా భాష, ఉపాధ్యక్షులు సాయి,లి ఫయాజు, విష్ణు, ఇర్ఫాన్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



# వసతి గృహాల మౌలిక వసతులను మెరుగుపరచాలి



**నంద్యాల ప్రతినిధి. జూలై 13 . (నంది పత్రిక ):**రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల విద్యార్థుల మెస్ చార్జీలను పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా తక్షణమే పెంచాలని, వసతి గృహాల మౌలిక వసతులను మెరుగుపరచాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మరియు నంద్యాల జిల్లా కమిటీ తరపున ఈ క్రింది సమస్యలను మీ దృష్టికి తీసుకొస్తున్నాము. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల బిసి గిరిజన ఎస్టి సంక్షేమ వసతి గృహాలతో పాటు గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థుల మెస్ బిల్లులను పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే నెలకు రూ. 3,000లకు పెంచాలని మా విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రారంభంలోనే విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచుతామని, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. కానీ నేడు ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ, మెస్ చార్జీల పెంపుపై ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేయడం అత్యంత శోచనీయం. ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, గ్యాస్, పాలు వంటి అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పాత చార్జీల ప్రకారమే నిధులు విడుదల చేస్తుండటంతో, వసతి గృహాల నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన మరియు పౌష్టికాహారాన్నిఅందించలేకపోతున్నారు. దీనివల్ల వసతి గృహాల్లోని వేలాది మంది పేద విద్యార్థులు తీవ్రమైన పోషకాహార లోపానికి గురవుతున్నారు, తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. మా ముఖ్యమైన డిమాండ్లు: పెరిగిన ధరల దృష్ట్యా అన్ని రకాల సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను తక్షణమే నెలకు రూ. 3,000లకు పెంచాలి. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇరుకు గదుల మధ్య నడుస్తున్న వసతి గృహాలకు తక్షణమే ప్రభుత్వ నూతన భవనాలను నిర్మించాలి. హాస్టళ్లలో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్ సరఫరా వంటి కనీస మౌలిక వసతులను మెరుగుపరచాలి. విద్యార్థులకు ఇచ్చే కాస్మోటిక్ చార్జీలను కూడా ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా పెంచాలి. నంద్యాల జిల్లా కలెక్టర్ ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యలను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, అలాగే జిల్లా స్థాయిలో ఉన్న హాస్టళ్లపై ప్రత్యేక నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జయసింహా రెడ్డి జిల్లా కార్యదర్శి దేవానంద్ విద్యార్థి నాయకులు సురేష్, శివ, నరేష్,కళ్యాణ్, పాల్గొన్నారు.

# నంద్యాలలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్







**నంద్యాల సిటీ బ్యూరో జూలై 13 ( నంది పత్రిక )** నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ లో ఈరోజు ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షల మహా శిబిరం ఘనంగా ప్రారంభమైంది. నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ , మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ సుమారు రూ. 15,000 విలువైన క్యాన్సర్ పరీక్షలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు . ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను జయిద్దాం అనే నినాదంతో, క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారని తెలిపారు . 30 ఏళ్లు పైబడిన మహిళలు, అలవాట్లు ఉన్నవారు, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు , అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారు ఈ సంచార క్యాన్సర్ స్క్రీనింగ్ వాహన సదుపాయాన్ని వినియోగించుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందని, నయం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు . ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, సెంట్రల్ ఫుడ్ కమిషన్ నెంబర్ విశ్వనాథ్ రెడ్డి , సీమ కృష్ణ , రమణారెడ్డి, వసుంధర దేవి, పలువురు ప్రజా ప్రతినిధులు, వైద్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# కొడుకును కత్తెరతో పొడిచి చంపిన తల్లి...

మద్యానికి బానిసై వేధిస్తున్న కన్నకొడుకును కన్నతల్లే హతమార్చిన విషాద ఘటన అనంతపురం నగరంలో చోటుచేసుకుంది. కుమారుడి వేధింపులు భరించలేకే ఆమె ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అనంతపురం పట్టణంలో నివసిస్తున్న సునీతకు సురేంద్ర (28) అనే కుమారుడు ఉన్నాడు. సురేంద్ర మద్యానికి బానిస కావడమే కాకుండా, తరచూ డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. ఈ క్రమంలోనే వారి ఇంట్లో నిత్యం గొడవలు జరుగుతుండేవి.

మంగళవారం 14 - 07 -2026

# ప్రజాస్వామ్యానికి దిక్సూచి ప్రెస్ క్లబ్..

### అనంతపురం ప్రెస్ క్లబ్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని రెండో రోజు రిలే దీక్షల్లో జర్నలిస్టుల డిమాండ్

**అనంతపురం బ్యూరో చీఫ్, జూలై 13 నంది పత్రిక** సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల తరఫున నిరంతరం పోరాడే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్ క్లబ్ ఒక కీలక వేదిక అని, అలాంటి సంస్థకు సకాలంలో ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరమని జర్నలిస్టులు పేర్కొన్నారు. అనంతపురం ప్రెస్ క్లబ్ ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సాధన, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం, పరస్పర ఐక్యతకు ప్రెస్ క్లబ్ ఒక బలమైన వేదికగా నిలుస్తుందని వారు తెలిపారు. ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, బీమా సదుపాయాలు వంటి సంక్షేమ అంశాల్లో ప్రభుత్వంతో సమన్వయం చేసి జర్నలిస్టులకు న్యాయం చేయడంలో ఎన్నికైన కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సంఘానికి సకాలంలో ఎన్నికలు జరగకపోతే పారదర్శకత, జవాబుదారీతనం దెబ్బతింటాయని, సభ్యత్వాల పేరుతో వసూలు చేసిన నిధుల లెక్కలను సభ్యుల ముందు ఉంచాలని దీక్షా శిబిరంలో పాల్గొన్న జర్నలిస్టులు డిమాండ్ చేశారు.



ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినప్పుడే కొత్త నాయకత్వం ముందుకు వచ్చి సంస్థకు కొత్త దిశ, దశను తీసుకురాగలదని అభిప్రాయపడ్డారు. అనంతపురం ప్రెస్ క్లబ్ ఎన్నికలను జిల్లా యంత్రాంగం పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని దీక్షలో పాల్గొన్న జర్నలిస్టులు కోరారు ఎన్నికల నిర్వహణలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ జర్నలిస్టులు ప్రెస్ క్లబ్ పేరుతో దిష్టిబొమ్మను ఏర్పాటు చేసి రెండో రోజు సెలన్ బాటిల్ ఎక్కిస్తూ చనిపోతుంది... కాపాడండి అంటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. . ఈ న్యాయమైన ఉద్యమానికి వివిధ పాత్రికేయ, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపిన వారిలో నమస్తే సీమాంధ్ర ఎడిటర్ ఎం. పరంధామ, చిన్న పత్రికల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఓబుళంపల్లి రామక్రిష్ణ, బీసీ విద్యార్థి సంఘం నాయకులు సాకే నరేష్, సీనియర్ జర్నలిస్ట్ శివ, ఎస్సీఎస్టీ

ప్రజా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఒళ్ళు కాలి చికిత్స పొందుతూ అంగన్వాడి ఆయా భర్త మృతి



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 13 :** బండి ఆత్మకూరు లోని మఠంపేటలో అంగన్వాడి సెంటర్ లో పనిచేస్తున్న ఆయా చౌడమ్మ భర్త కుం టుమల్ల రామసుబ్బయ్య (50) సోమవారం ఉదయం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల నాలుగవ తేదీన ఇంటి వద్ద నీటి కొళాయి కి మరమ్మతు చేస్తూ ఉన్నాడు. కొళాయి పైపులు కాల్చి వేసేందుకు దానిపై ట ర్పెంటు ఆయిల్ పోసేందుకు ఇంట్లో నుండి టర్మెంటు బాటిల్ తీసుకొని వచ్చాడు. టర్పెంట్ ఆయిల్ మూత తీసి, కొళాయి పైపును అంటించాడు. గాలికి పక్కనే ఉన్న టర్పెంట్ బాటిల్ అంటుకొని మంటలు చెలరేగి రామసుబ్బయ్య రెండు చేతులు వీపు భాగం కాలిపోయాయి. మంటలకు తాళలేక రామసుబ్బయ్య పక్కనే ఉన్న గచ్చులోకి దూకాడు. వెంటనే చికిత్స నిమిత్తము రామసుబ్బయ్యను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ విషయంపై సమాచారం అందిన వెంటనే ఏఎస్ఐ మహబూబ్ బాషా కర్నూలు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రెండు నెలల క్రితమే రామసుబ్బయ్య ఓ ప్రమాదం నుండి బయటపడ్డాడు. పొలానికి వెళ్లి ఎండు గడ్డిని అంటించే ప్రయత్నంలో వడ దెబ్బ సోకి స్పృహ కోల్పోయారు. ఈ సంఘటన నుండి కోల్కున్నప్పటికీ తిరిగి ప్రమాదానికి గురయ్యాడు. ఈనెల మూడవ తేదీన కూతురు వివాహం చేశాడు. అదే రోజు సాయంత్రం ఇంటి వద్ద కులాయి పైపు మరమ్మతు చేస్తూ ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలయ్యాడు. పది రోజుల నుండి కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు.

# ప్లాస్టిక్ వాడకాన్ని మానేద్దాం





### వ్యాపారులకు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపు
### ప్రతి దుకాణం వద్ద డస్ట్‌బిన్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి
### ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై నిరంతర తనిఖీలు

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు వ్యాపారులు, ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం పాత బస్టాండ్ ప్రాంతంలోని దుకాణాలను సందర్శించి, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగాన్ని వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా పూర్తిగా నిలిపివేయాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు నగరపాలక సంస్థ నిరంతరం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 201 దాడులు నిర్వహించి 250 కిలోలకు పైగా నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.1,95,150 జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్లాస్టిక్‌కు బదులుగా వస్త్ర, కాగిత సంచులు వంటి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. అలాగే ప్రతి వ్యాపార సంస్థ తమ దుకాణం ముందు తప్పనిసరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, చెత్తను రోడ్లపై వేయకుండా అందులోనే వేయాలని సూచించారు. నగర పరిశుభ్రతకు ప్రతి వ్యాపారి భాగస్వామి కావాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు సుంకేసుల రోడ్డు, ఎన్.ఆర్.పేట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను కమిషనర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సానిటరీ సూపర్వైజర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జున, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహా శైవాక్షయోగం సందర్భంగా శివాలయాల్లో భక్తుల పూజలు



**బండి ఆత్మకూరు నందిపత్రిక జూలై 13:** మహా శైవాక్ష యోగం సందర్భంగా సోమవారం నాడు శివాలయాల్లో భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఓంకార పుణ్యక్షేత్రం తో పాటు బండి ఆత్మకూరులోని శివాలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాల్లో మునిగి తేలారు. మహాశైవాక్షయోగం అనేది హిందూ జ్యోతిష్య శాస్త్రంలో అత్యంత పవిత్రమైన అరుదైన ఆధ్యాత్మిక యోగం. కృష్ణపక్ష చతుర్దశి తిథి ఆరుద్ర నక్షత్రం తో పాటు సోమవారం అనే మూడు ఒకే రోజున కలిసి రావడం వల్ల ఈ అరుదైన యోగం ఏర్పడింది. ఈ యోగం దాదాపు 20 ఏళ్ల కాలచక్రంలో కేవలం 9 సార్లు సంభ వించింది. ఈ ఒక్కరోజు శివారాధన చేయడం వల్ల వంద మహాశివరాత్రి పుణ్యఫలం దక్కుతుందని ఆధ్యాత్మిక పండితులు చెబుతున్నారు. పరమేశ్వరుడికి అత్యంత ప్రీతికరమైన రోజైన సోమవారం, అందునా శివయ్య జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం కలిసి రావడం వల్ల ఈరోజు భక్తులకు విశేష ఫలితాలను ఇస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఓంకారం పుణ్యక్షేత్రంలో విశేషమైన పూజలు నిర్వహించారు. బండి ఆత్మకూరు లోని చౌడేశ్వరి ఆలయం సమీపంలో ఉన్న శివాలయంలో మహిళలు తెల్లవారుజామున లింగాకారుడైన శివయ్యకు జలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించి పూజా కార్యక్రమాలను చేపట్టి పునీతులయ్యారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన మహా శై వాక్షయోగం గురించి ప్రజలకు వివరించడంలో దేవాదాయ శాఖ విఫలమైంది. ఈ యోగం ప్రాముఖ్యత గురించి దేవాదాయ శాఖ ముందుగానే ప్రచారం నిర్వహించి ఉంటే భక్తులు పెద్ద ఎత్తున శివాలయాల్లో పాల్గొని పూజలు నిర్వహించే పరిస్థితులు ఏర్పడి ఉండేవి.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన
## ఆత్మకూరు ఎన్ టిఆర్, కెవికె, స్టేడియం క్రీడాకారులు

### ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్న ఆత్మకూరు జట్టు
### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణం: స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా
### ఆత్మకూరును క్రీడా పట్టణంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం

**ఆత్మకూరు, జూలై 13 (నంది పత్రిక):** నెల్లూరు పట్టణంలోని ాజ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 11, 12 తేదీల్లో 'యూత్ & స్పోర్ట్స్ ప్రమోషన్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' నిర్వహించిన ఛాంపియన్షిప్-2026 రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీల్లో ఆత్మకూరు ఎన్టీఆర్ కెవికె స్టేడియం క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి, ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి పోటీల్లో ఆత్మకూరు స్టేడియం జట్టు బాపట్ల, కడప, శ్రీకాకుళం జట్లపై అద్భుత విజయాలు సాధించి ఫైనల్స్‌కు దూసుకెళ్లిందన్నారు. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు విజేతగా నిలవగా, ఆత్మకూరు జట్టు రన్నరప్‌గా (ద్వితీయ స్థానం) నిలిచిందని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన ఆత్మకూరు జట్టు, వచ్చే సెప్టెంబర్ నెలలో గోవాలో జరగబోయే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం నియోజకవర్గానికే గర్వకారణమన్నారు. శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రత్యేక సహకారంతో ఆత్మకూరు స్టేడియంలో ప్రస్తుతం 8 రకాల క్రీడల్లో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పస్పిల్ మున్నా వెల్లడించారు. చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ కోటా ఉంటుందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



**త్వరలో ఆత్మకూరులో జాతీయ స్థాయి 'సౌత్ జోన్' పోటీలు:** క్రీడాకారులను అద్భుతంగా తీర్చిదిద్ది, జట్టు ద్వితీయ స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించిన కబడ్డీ శిక్షకులు (కోచ్) సతీష్‌ను ఈ సందర్భంగా చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అనుమతితో ఆత్మకూరు ఎన్టీఆర్ కెవికె స్టేడియంలో 'జాతీయస్థాయి సౌత్ జోన్ ఆల్ స్పోర్ట్స్' పోటీలను ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. పేద క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించడమే ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ యొక్క ముఖ్య ఆశయమని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నాయబ్ సయ్యద్ అసదుల్లా, జూనియర్ లెక్చరర్ అబ్దుల్ జబ్బార్, రేణుకా ప్రసాద్, ఖో-ఖో శిక్షకులు మహబూబ్, సయ్యద్, సాదిక్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

# సాహో ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు,ల్యాప్‌టాప్‌ల పంపిణీ



**మద్రిపాడు జులై 13నంది పత్రిక :** మద్రిపాడు మండలంలో విద్యార్థుల విద్యాభివృద్ధి,సంక్షేమం లక్ష్యంగా సాహో ఫౌండేషన్,మద్రిపాడు వారి ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మరియు ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తల్లి లేదా తండ్రి లేదా ఇద్దరూ లేని విద్యార్థులలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన టాప్ టెన్ విద్యార్థులలో మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి రూ.10,000 చొప్పున,మిగిలిన ఏడు మంది విద్యార్థులకు రూ.5,000 చొప్పున నగదు బహుమతులు అందించారు. అలాగే ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులలో మొదటి రెండు స్థానాలు సాధించిన వారికి రూ.10,000 చొప్పున,మిగిలిన మూడు స్థానాలు సాధించిన వారికి రూ.5,000 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఇదే కార్యక్రమంలో రోటరీ క్లబ్, సైబరాబాద్ వారి సౌజన్యంతో బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకులు,నిష్‌బిట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత పడచల నాగేశ్వరరావు మాట్లాడుతూ,కొన్ని కుటుంబాలలో తల్లి లేదా తండ్రి లేదా ఇద్దరినీ కోల్పోవడం వల్ల విద్యార్థుల జీవితాల్లో నిర్లిప్తత,ఆత్మ విశ్వాసం లోపించే అవకాశముందని,అలాంటి విద్యార్థులకు అండగా నిలిచి వారి విద్యాభివృద్ధికి తోడ్పడటమే సాహో ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన ఆత్మకూరు డివిజనల్ విద్యాశాఖాధికారి జానకిరామ్ మాట్లాడుతూ,మద్రిపాడు మండలంలో విద్యార్థుల సంక్షేమం కోసం సాహో ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఘనంగా కొనియాడారు. రాబోయే రోజుల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు తిరుపతయ్య,ధనలక్ష్మి,చిలకపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మారుతి కేశవరెడ్డి,బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాసులు,పొంగూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు,కేజీబీవీ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి,విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి జొన్న సత్యనారాయణ,విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పడచల రామయ్య,సాహో ఫౌండేషన్ సభ్యులు కర్యావుల రమణయ్య,పడచల నాగేశ్వరరావు సతీమణి సునీత,వారి తల్లి సుబ్బమ్మ,దయాకర్ రెడ్డి,రవి కుమార్,మార్గదర్శి ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలను జాగ్రత్తగా పోషించాలి

### -హార్టికల్చర్ సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యం
### -ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ వెంకటరామి రెడ్డి

**కొత్తపల్లి - నంది పత్రిక :** వీబీజీ రాంజీ పథకం ద్వారా రైతులు పంటపొలాల్లో నాటుకున్న మొక్కలను జాగ్రత్తగా పోసించాలని వీబీజీ రాంజీ ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ వెంకటరామి రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రం పరిధిలోని రైతుల పొలాల్లో నాటిని టెంకాయ మొక్కల స్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీబీజీ రాంజీ పథకం ద్వారా రైతులకు హార్టికల్చర్ సాగుక్రింద కొబ్బరి మొక్కలను ఇచ్చామన్నారు. వాటిని నాటిన తరువాత వాటి చుట్టూ గుంతలు చేసుకొని, కట్టలమాదిరి నీటిని నిలువ చేసుకొనేందుకు ఏర్పాటు చేసి ప్రతి రోజు నీరు పోసి జాగ్రత్తగా పోషించుకోవాలని సూచించారు. రైతులకు అధికారులు అవగాహకల్పించాలన్నారు. హార్టికల్చర్ సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. హార్టికల్చర్ సాగు రైతులకు భవిష్యత్తులో ఆదాయ వనరుగా నిలుస్తుందన్నారు. అనంతరం కార్యాలయంలో పలు రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేసి రికార్డులు, రిజిస్టర్లు తప్పులులేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ విమలమ్మ, టీఏ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



# శ్రీశైలం దేవస్థానంలో వైభవంగా స్వర్ణరథోత్సవం





**శ్రీశైలం జూలై 13(నంది పత్రిక)** ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని (13.07.2026) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.

**అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది.** ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమములో చీఫ్ విప్ శ్రీ జి.వి. ఆంజనేయులు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ఏ.వి. రమణ, శ్రీ ఆలా అనిల్ కుమార్ ఆలయ విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి కె. వేంకటేశ్వరా రావు, అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.





# నంద్యాలలో దివ్యాంగులకు ఉచిత హీరో మోటార్ సైకిళ్ల పంపిణీ

## దివ్యాంగుల సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల సిటీ బ్యూరో జులై 13 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగుల లబ్ధిదారులకు ఉచితంగా హీరో మోటార్ సైకిళ్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ , మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పంపిణీ చేశారు . ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, ఆత్మగౌరవం, స్వావలంబనకు కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు నెలకు రూ.6,000 సామాజిక భద్రతా పెన్షన్, మంచానికే పరిమితమైన లబ్ధిదారులకు రూ.15,000 పెన్షన్ అందజేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దివ్యాంగులు, బెడ్-రిడెన్ బాధితులకు ఈ స్థాయిలో ఆర్థిక భరోసా కల్పిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. అలాగే, పెన్షన్లతో పాటు ఉచిత మోటార్ సైకిళ్లు, ఉపకరణాలు, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల ద్వారా దివ్యాంగులను అన్ని రంగాల్లో సాధికారత వైపు నడిపించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కట్టుబడి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు దేవరపాటి రవికుమార్, మిద్దె ఉసేని, బాలస్వామి, ఖాజా శంకర్ , వేద సాయి, హారున్ బేగ్ తదితరులు పాల్గొన్నారు

# మండల ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

## బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి.



**బేతంచర్ల జూలై 13 (నందిపత్రిక )** బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయ హాల్ నందు,బేతంచెర్ల మండల సర్వ సభ్య సమావేశం సోమవారం నాడు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బుగ్గన నాగ భూషణం రెడ్డి ఆధ్యక్షతన, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.ఫజుల్ రహమాన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.బేతంచెర్ల వెటర్నరీ ఏడి రామ సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ సభ్యురాలు శివ లక్ష్మి హాజరయ్యారు.ఈ సందర్బంగా ఎంపీపీ మాట్లాడుతూ బేతంచర్ల మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతి నిధులుసమిష్టిగా కృషి చేయాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి సూచించారు.మండల గ్రామాల్లోని సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎంపీపీ సూచించారు. ఎంపీడీవో ఎం. ఫజుల్ రహిమాన్ మాట్లాడుతూ ప్రభుత్వంలో భాగంగా వాట్సాప్ గవర్నెన్స్ సేవలు మండల ప్రజలందరికీ అందుబాటులో ఉన్నందుకు అధికారులు ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీసభ్యులు గ్రామాల ఇంచార్జ్ అధికారులు పాల్గొని మండల సమస్యలపై చర్చించారు.వివిధ శాఖల అధికారులు వారి వారి నివేదికలను, చేసిన అభిబృద్ధి పనులను సమావేశంలో సభ్యులకు చదివి వినిపించారు. సమావేశం సాదా సీదాగా జరిగింది.

# ప్రజా ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా స్పందించాలి..!

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప, బ్యూరో చీఫ్ జూలై 13 నంది పత్రిక** : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అధికారులు అలసత్వం వీడి ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. భూ సంబంధిత సమస్యలను రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలనలో పీజీఆర్ఎస్ నిర్వహణలో జిల్లా పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, అర్జీల పరిష్కారంలో ఆలస్యం లేకుండా అన్ని శాఖలు మరింత అప్రమత్తంగా పనిచేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన చేసి, అర్జీదారులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులు తెలుసుకొని సరైన సమాధానాలు ఇవ్వాలని, పొంతనలేని నివేదికలు సమర్పించరాదని అధికారులను హెచ్చరించారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సమాచార లోపాలు లేకుండా చూడాలని సూచించారు.పిజిఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన అర్జీలపై ప్రజల సంతృప్తి (పబ్లిక్ సాటిస్ఫాక్షన్) స్థాయిని కూడా ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అందువల్ల ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి డీపీవో వెంకటసుబ్బయ్య, ఎస్.ఎస్.ఈ. ఏపిసి అనురాధ, డీఆర్‌డీఏ పీడీ జి. రాజ్యలక్ష్మి, డీఎస్ఓ రఘురాం, డిఎంహెచ్ఓ డా. రవిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు..





# ఆడపిల్లలను చదివిస్తే మంచి భవిష్యత్తు

## ఐసీడీఎస్ సూపర్వైజర్ కవిత



**మహానంది,జూలై 13 (నంది పత్రిక):-** ఆడపిల్లలను చదివిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని వాళ్ళ కాళ్ళ మీద వాళ్లే నిలబడగలుగుతారని ఐసీడీఎస్ సూపర్వైజర్ తోట కవిత పేర్కొన్నారు.సోమవారం మహానంది మండల ఈ తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'బేటి బచావోబేటి పడావో' కార్యక్రమం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ...బాలికల విద్య సమాజ అభివృద్ధికి పునాది అని తెలిపారు. 19 ఏళ్లు దాటిన తర్వాతే వివాహాలు చేయాలని, అలా చేస్తే బాలింతల ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని సూచించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అన్నారు. ఆడపిల్లలకు తెలియని వయసులో వివాహాలు చేస్తే అనారోగ్యంతో పాటు, పిల్లలకు కూడా అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అన్నారు. బాలికలు సమాజానికి మణిహారమని, బాలికలను రక్షణ కల్పిద్దాం, బంగారు భవితకు పునాది వేద్దాం అన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందు ఉంటూ భారత దేశ ప్రగతికి రథచక్రాలుగా మారాలని వారి అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కిషోర బాలికల సంక్షేమ అభివృద్ధి, అక్షరాస్యత, ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. నంద్యాల శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ డీఎన్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, మహిళా పోలీస్ లక్ష్మీదేవి సైబర్ నేరాలు, శక్తి యాప్ పనితీరు ,చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



# ఎం.జె.పి స్కూల్ నుండి తప్పి పోయిన విద్యార్థి.

## వెదికి పట్టు కొని తల్లిదండ్రులకు అప్పగించిన బేతంచెర్ల ఎస్.రమేష్ బాబు.



**బేతంచెర్ల, జూలై 13 (నందిపత్రిక ).** బేతంచర్ల మండల పరిధిలోని గొరుమాను కొండగ్రామ పరిధిలో గల మహాత్మా జ్యోతిబా పూలే స్కూల్ నందు 7వ తరగతి చదువు తున్న సోగాల ధనుష్(13 సం.లు ) సోమవారం నాడు పాఠశాలకు వెళ్లకుండా పారిపోయాడు. సంజామల మండలం, రామి రెడ్డి పల్లె గ్రామానికి చెందిన రామ్మోహన్ కుమారుడైన ధనుష్ ను వారం రోజుల క్రితం తల్లి ఎం.జె.పి పాఠశాలలో చేర్పించారు.హాస్టల్లో ఉండడం ఇష్టం లేక పోవడంతో తల్లి ధనుస్ని సిమెంట్ నగర్ లోని పెద్దమ్మ ఇంటి వద్ద ఉంచింది. సోమవారం ఉదయం సిమెంట్ నగర్ నుండి పాఠశాలకు తీసు కెళ్తుండగా మార్గమధ్యలో తల్లి నుండి తప్పించుకొని ధనుష్ బేతంచెర్ల కొత్త బస్టాండ్ వద్దకు చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న సి.ఐ వెంకటేశ్వరరావు, ఎస్.ఐ వి.రమేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు ధనుష్ ను బేతంచెర్ల పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చారు. తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అప్పగించారు. తమ కుమారుడిని సురక్షితంగా బేతంచెర్ల పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించడంపై,వారు హర్షం వ్యక్తం చేశారు.పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# బొల్లవరంలో బాల నందీశ్వర స్వామివారికి 1121 బిందెలతో జలాభిషేకం





**మహానంది జూలై 13 (నంది పత్రిక):-** మహానంది మండలం బొల్లవరం గ్రామంలో వానలు బాగా కురవాలని బాల నందీశ్వర స్వామివారికి 1121 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. ముందుగా సోమవారం మాస శివరాత్రి,ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం 1121 బిందెలతో బాల నందీశ్వరునికి జలాభిషేకం చేశారు.సకాలంలో వానలు కురిసి పాడి పంటలు అభివృద్ధి చెందాలని ప్రజలు వేడుకున్నారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

## ఏఎంసీ వైస్ చెర్మన్ సాదుల పవన్ కుమార్



**నంగునూరు జులై 13** నంగునూర్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా,పారదర్శకంగా పూర్తి చేయాలని ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను అత్యంత కచ్చితత్వంతో పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సాదుల పవన్ కుమార్, నంగునూరు మండల కేంద్రంలో పర్యటించి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ఎలా జరుగుతోందో క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు, హెల్ప్‌డెస్క్‌ల పనితీరును కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), సిబ్బందితో మాట్లాడి ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నితీష్, జీపీఓ దేవరాజు,ఎఫ్ ఏ నరసింగరావు, బిఎల్ఓలురాజమల్లవ్వ,విమల,లక్ష్మి, లక్ష్మి, రేణుకా, జహీర్, స్వప్న,సుజాత,లావణ్య, బిల్ కలెక్టర్ అశోక్ కుమార్, లవన్ కుమార్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో నంద్యాల,గోస్పాడు మండలాలల కొరకు మరో మొబైల్ క్యాంటీన్ అట్టహాసంగా ప్రారంభం..





## కేవలం ఒక్క రూపాయికే రోటీ, చపాతి కర్రీ పప్పు ఒక రూపాయికే రుచికరమైన భోజనం అందించి ప్రతి ఒక్కరి కడుపు నింపాలనే ప్రధాన ఉద్దేశం..

## గోళ్ళ రాజేష్ నిర్వహిస్తున్న ఎన్నో సేవా కార్యక్రమాలను ఉద్దేశిస్తు గోళ్ళ రాజేష్ ను అభినందించిన ముఖ్య అతిథులు..

**నంద్యాల సిటీ బ్యూరో జులై 13 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణమే కాకుండా నంద్యాల మండలం, గోస్పాడు మండలం పల్లెలకు కూడా మొబైల్ క్యాంటీన్ ద్వారా అందరి ఆకలిని తీర్చాలని ముఖ్య ఉద్దేశంతో మరో నూతన మొబైల్ క్యాంటీన్ అట్టహాసంగా ప్రారంభించారు. నంద్యాల నియోజకవర్గంలో గడిచిన సంస్థ కాలం పైగా నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత సామాజిక సేవకుడైన గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలు కేవలం ఒక్క రూపాయి కే చపాతీ కర్రీ పప్పు ఒక్క రూపాయికే రుచికరమైన నాణ్యత కరమైనటువంటి భోజనం అందరికీ తెలిసిన విషయమే పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఫుడ్ కౌంటర్ ఏర్పాటుచేసి ఎన్నో వందల మంది కడుపు నింపుతున్నారు. అదేవిధంగా మొబైల్ క్యాంటీన్ ద్వారా నంద్యాల ప్రధాన కూడళ్లు తిరుగుతూ ప్రతి ఒక్కరికి ఆకలిని తీరుస్తున్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ రాజకీయ నాయకులు మాజి కౌన్సిలర్ కత్తి శంకర్ మాట్లాడుతూ ముందుగా నంద్యాల నియోజకవర్గం ప్రజలందరి తరపున గోళ్ళ రాజేష్ కు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు గతంలో కూడా మహాత్ములు చెప్పారు ప్రజలందరికీ అన్నం పెట్టాలని ఎవరు కూడా ఆకలితో ఉండకూడదని మహాత్ములు తెలియజేశారు రాజ్యంలో చివరికి ఏ ఒక్క కుక్క కూడా ఆకలిగా ఉండకూడదని అలాంటి రాజ్యమే సుభిక్షమైన రాజ్యం అనేది నానుడి కాశి రెడ్డి నాయనా కూడా ఎన్నో భోజన సత్రాలను ఏర్పాటు చేసారని వారిని స్ఫూర్తిగా తీసుకుని దివంగత మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కూడా ఒక రూపాయికే రొట్టె , పప్పు అందించారన్న విషయాన్ని గుర్తు చేశారు. తర్వాత ఎవరు పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ముందుకు వస్తారని ఎదురు చూస్తున్న తరుణంలో దైవాంశ సంభూతునిగా గోళ్ళ రాజేష్ వచ్చారని భగవంతుడు అంటే ఎక్కడో ఉండడని మనకు సాయం చేసేవారు మనకు అన్నం పెట్టే వారే భగవత్ స్వరూపులుగా భావించాలని ఈ సందర్భంగా కత్తి శంకర్ తెలిపారు. కేవలం ఒక్క రూపాయికే ప్రతి ఒక్కరి ఆకలి తీరుస్తూ ఈరోజు నంద్యాల మండలం,గోస్పాడు మండలాల్లో కూడా ఒక్క రూపాయికే ప్రజల ఆకలి తీర్చేందుకు ముందుకు వచ్చినందుకు గోళ్ళ రాజేష్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ భగవత్ సేవా సమాజ్ పాలక మండలి సభ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ గొల్ల రాజేష్ అంటే సేవా సేవా అంటే గోళ్ళ రాజేష్ అనే విధంగా నంద్యాల నియోజకవర్గంలో పరిస్థితి ఏర్పడిందని గతంలో ఎన్నడూ లేనివిధంగా గోల రాజేష్ వినూత్న రీతిలో ప్రజలకు ఎన్నో సహకారాలు అందిస్తున్నారని నిరుద్యోగులకు వికాసభృతి వ్యాధిగ్రస్తులకు ప్రతినెల 2000 రూపాయలు విలేకరులకు 3000 రూపాయలు గౌరవ ఆర్థిక సహకారం, కేవలం ఒక్క రూపాయికే వృశ్చిక రమైన చపాతీ భోజనం అందిస్తూ ప్రతి ఒక్కరి కడుపు నింపుతున్నందుకు గోళ్ళ రాజేష్ యొక్క సేవా కార్యక్రమాలు అభినందించదగ్గ విషయాలని గోళ్ళ రాజేష్ ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గోళ్ళ రాజేష్ కార్యక్రమాల సమన్వయకర్త రిపోర్టర్ నూర్ భాషా మాట్లాడుతూ ఈరోజు ఎంత శుభదినం అని ఇప్పటికే ఎన్నో సేవా సేవ సహాయ,సహకారాలు,ఆర్థిక సహకారాలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా కేవలం ఒక్క రూపాయికే లేట్ చపాతి ఒకరిపై భోజనం అందిస్తూ ప్రతి ఒక్కరి ఆకలిని తీరుస్తున్నటువంటి సందర్భంలో ఈరోజు మరొక మొబైల్ క్యాంటీన్ ఏర్పాటు చేసి నంద్యాల మండలం గోస్పాడు మండలం గ్రామాలకు సైతం తిరిగి అక్కడి ప్రజలకు కూడా ఒక రూపాయికే ఆహారాన్ని అందిస్తు కడుపు నింపాలని మరో నూతన మొబైల్ క్యాంటిన్ కు శ్రీకారం చుట్టిన గోళ్ళ రాజేష్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ మీద అభిమానంతో విచ్చేసిన ప్రతి ఒక్కరికి నూర్ భాషా అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు రానున్న కాలంలో గోళ్ళ రాజేష్ నిర్వహించబోయే ప్రతి సేవా కార్యక్రమాలలో తమ వంతు సహాయ సహకారాలు అందించగలరని కోరారు. కోల రాజేష్ ఇలాంటి అద్భుతమైన సేవాసాయ సహకారాలు తన ద్వారా చేపిస్తున్నందుకు ఓల రాజేష్ కి జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగానూర్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో ూ.మార్క, ఏలియా,ఓబ్లేస్,రవికుమార్, రమేష్,రాజు,కరిముల్లా,కిరణ్, అబిసాలం,సంజీవ రాయుడు, విజయ్ కుమార్,మహబూబ్,రామ మోహన్,చాంద్ బాషా,అన్వర్ తదితరులు పాల్గొన్నారు






# నేటి నుంచిపొలం పిలుస్తోంది కార్యక్రమం.



**రుద్రవరం ప్రతినిధి జులై 13 (నంది పత్రిక):** రుద్రవరం మండలంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతుల కోసం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుందని మండల వ్యవసాయ అధికారి జి. సుమతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూప్రతి మంగళ, బుధవారాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా సాగు చేసిన పంటలకు సోకే పురుగులు, తెగుళ్ల నివారణతో పాటు సమగ్ర పంటల యాజమాన్యంపై రైతులతో నేరుగా చర్చించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల (జూలై) షెడ్యూల్ ప్రకారం జూలై 14న కె.కొత్తూరు, చెంచుగూడెం (కోటకొండ ఆర్.ఎస్.కె), 15న కోటకొండ, పెద్దకంబలూరు, 21న డి.కొట్టాల, శ్రీరంగపురం, 22న బీరవోలు, ఎల్లవత్తుల, 28న అప్పనపల్లె, చిన్నకంబలూరు, మరియు 29వ తేదీన కొండమాయపల్లె, బి.నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో అధికారులు పర్యటించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

# అంగన్వాడి కేంద్రంలో చిన్నారికి తీవ్ర గాయాలు.



**రుద్రవరం ప్రతినిధి జులై 13 (నంది పత్రిక):** మండలంలోని పెద్ద కంబలూరు 2వ అంగనవాడి కేంద్రంలో పల్లవి అనే చిన్నారికి తలపై రాయిపడి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం గ్రామస్తుల వివరాల మేరకు పల్లవి తల్లిదండ్రులు తమ కూతురిని అంగన్వాడి కేంద్రంలో వదిలి పొలం పనులకు వెళ్లారన్నారు. అంగన్వాడి కేంద్రం దగ్గర మిద్దె పైనుంచి రాయి పడడంతో చిన్నారి పల్లవికి తలపై తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. గ్రామస్తులు సమాచారాన్ని 108 కి చేరవేయడంతో వెంటనే రుద్రవరం 108 వాహనం సిబ్బంది అక్కడికి చేరుకొని చిన్నారికి ప్రధమ చికిత్స చేసి వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అన్నారు.

# స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలి.

## జాయింట్ కలెక్టర్, ఎలక్షన్ స్పెషల్ ఆఫీసర్ గోవిందరావు.



**తిరుపతి బ్యూరో చీఫ్ జూలై 13 నంది పత్రిక** నియోజకవర్గ పరిధిలో పారదర్శకమైన, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు అందరూ సహకరించాలని 167 – నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి, జాయింట్ కలెక్టర్ గోవిందరావు అన్నారు. నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవితో కలిసి సోమవారం రాయల్ చెరువు రోడ్డులోని 156, 157, 158, 159 పోలింగ్ కేంద్రాల బూత్ లెవెల్ ఏజెంట్లు (బి.ఎల్.ఏ), బూత్ లెవెల్ ఆఫీసర్ల (బి.ఎల్.ఓ)తో సమావేశం నిర్వహించారు. ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు ప్రత్యేక ఓటర్ల సవరణ ( ఎస్ ఐ ఆర్) ప్రక్రియ నిర్వహిస్తున్నామని అన్నారు. మంగళవారం తో ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది అన్నారు. అనంతరం ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఈ జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. అందులో ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో ఈ డి టి సుధాకర్ నాయక్, బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ విజయవంతంగా నిర్వహించాం.





## ఓటర్ల నమోదు అధికారి, కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి.

**తిరుపతి బ్యూరో చీఫ్ జూలై 13 నంది పత్రిక** 167– తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర సవరణ( ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో మీ అందరి సహకారంతో ఎన్యుమరేషన్ ఫారముల పంపిణీ, డిజిటైజేషన్ ప్రక్రియను అధికారులు విజయవంతంగా నిర్వహించారని ఓటర్ల నమోదు అధికారి, కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి అన్నారు.

ప్రత్యేక సమగ్ర సవరణ( ఎస్ ఐ ఆర్) ప్రక్రియ పై సోమవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని మొత్తం 2,95,288 మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారములు పంపిణీ చేయగా, 100 శాతం పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఇప్పటివరకు 2,02,521 గణన ఫారములు (68.51%) ఆన్లైన్లో డిజిటైజ్ చేయబడ్డాయని తెలిపారు. అదేవిధంగా 92,593 ఫారములు (31.43%) డిజిటలైజేషన్ చేయలేని కేటగిరీలో నమోదు చేయబడ్డాయని తెలిపారు.

డిజిటైజ్ చేయలేని ఫారములకు గల కారణాలు:-

చనిపోయిన ఓటర్ల సంఖ్య : 5,897

ఆబ్సెంట్ ఓటర్ల సంఖ్య: 21,214

శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల సంఖ్య: 58,476

డూప్లికేట్ ఓటర్ల సంఖ్య : 5,946

మిగిలిపోయిన ఓటర్ల సంఖ్య: 128

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు బూత్ లెవల్ అధికారులు ఎన్నికల సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేశారని తెలిపారు. సోమవారం జరిగిన పొలిటికల్ పార్టీ సమావేశం నందు పార్టీ ప్రతినిధులతో పై తెలిపిన వివరాలను క్లుప్తంగా వివరించారు. ఓటర్ల వివరాలను సక్రమంగా నవీకరించడం ద్వారా స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు కూడా ఎన్నికల ప్రక్రియలో సహకరించి, తమ ఓటరు వివరాలను సరిచూసుకొని అవసరమైతే నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు, దరఖాస్తులు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు, ఈడిటి సుధాకర్ నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన మహానంది క్షేత్రం

## అభిషేక ప్రియుడికి 80 పైగా అభిషేకాలు



**మహానంది జూలై 13 (నంది పత్రిక):-** మహానంది క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతుంది. సోమవారం మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మహానందికి తరలివచ్చారు. శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకార్చనలు నిర్వహించుకున్నారు. అభిషేక ప్రియుడైన మహానందీశ్వరునికి సుమారు 80 కు పైగా అభిషేకాలు జరిగినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మరియు మండలంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.పరమేశ్వరునికి ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని అన్నాభిషేకం,అభిషేకార్చన పూజలు నిర్వహించారు.



# ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా.. ఆరోపణలు నిరూపించాలన్న యార్లగడ్డ

గన్నవరం విమానాశ్రయ టెండర్ల వ్యవహారంలో తనపై వస్తున్న ఆరోపణలను గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు తీవ్రంగా ఖండించారు. తన ప్రమేయం ఉన్నట్లు నిరూపిస్తే కేవలం ఐదు నిమిషాల్లోనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఆయన సవాల్ విసిరారు. పార్టీ కార్యకర్తల ఆందోళనను తెలియజేయడమే తన ఉద్దేశమని, తన వ్యాఖ్యలు ప్రభుత్వానికి లేదా పార్టీకి వ్యతిరేకంగా చేసినవి కాదని ఆయన స్పష్టం చేశారు సోమవారం విజయవాడలోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో యార్లగడ్డ మాట్లాడారు.

సాక్షి సహా కొన్ని యూట్యూబ్ ఛానెళ్లు తన మాటలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఎయిర్‌పోర్ట్ టెండర్‌ను తన అనుచరుడికి ఇప్పించేందుకు ప్రయత్నించానన్న ఆరోపణలను ఆయన పూర్తిగా తోసిపుచ్చారు.

రెండేళ్ల తర్వాత ఎయిర్‌పోర్ట్ అడ్వైజరీ కమిటీ వైస్-ఛైర్మన్ హోదాలో తాను సమావేశానికి హాజరయ్యానని వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న పనులు, టెండర్లు, పెరుగుతున్న ఖర్చులపై చర్చ జరిగిందని పేర్కొన్నారు.

ప్రజాధనం వినియోగంపై వివరాలు అడగడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని, ఆ సమావేశంలో విజయవాడ, మచిలీపట్నం ఎంపీలు కూడా పలు ప్రశ్నలు లేవనెత్తారని ఆయన గుర్తు చేశారు.

# తాండవమల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశైవాక్షయోగ పూజలు



**కొత్తపల్లి – నంది పత్రిక :** మండల కేంద్రంలో వెలసిన తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పురోహితులు మప శైవాక్షయోగం పూజలు జరిపించారు. జూలై 13 వతేవి అత్యంత అరుదైన ఈ మహాశైవాక్షయోగం వందేళ్ళకోసారి వస్తుందని పురోహితులు తెలుపుతున్నారు. ఈ రోజున శివారాధన చేస్తే విశేష జీవిత ఫలితాలు ఉంటాయని పురోహితులు చెప్పారు. అందువల్ల మండల కేంద్రంలోని తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమార్చన. పుష్పార్చన, బిల్వార్చన, మహ మంగళహారతీ వంటి విశేష పూజలు చేశారు. ఈ రోజున భక్తితో శివున్ని చిన్న పూజచేసిన ఆయన అనుగ్రహం ఉంటుందని పురోహితులు పలికారు.

# రైతులంతా పంటలకు బీమాలు చేయించుకోవాలి

## - ఏ వో అమిరున్నిసా బేగం



**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని రైతులంతా ఖరీఫ్సీజన్కు సాగుచేసుకొన్న పంటలకు పంటబీమా, ప్రదానమంత్రి పసల్ బీమాలను తప్పకుండా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి అమిరున్నీసా బేగం సూచించారు. సోమవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఖరీఫ్ సీజన్ కు నిర్ణీత గడువులోగా వాతావరణ ఆధారిత పంటల బీమా, ప్రదాన మంత్రి పసల్ బీమా చేయించుకోవాలని చెప్పారు. పత్తి పంటకు రూ.1600 ప్రీమియం, వేరుశెనగ కి రూ.560 చొప్పున ప్రీమియంను ఈ నెల 15లోగా, పంట స్వీయ ధ్రువీకరణ పత్రం ద్వారా చెల్లించాలి అన్నారు. పిఎంఎఫ్బపై ద్వారా మొక్కజొన్న పంటలకు రూ.660 ఎకరానికి, వరికి రూ.800, ఉల్లి రూ.450 ప్రీమియం, జులై 31 తేదిలోగా చెల్లించాలి అన్నారు. ఏపీ ఏఐఎంఎస్ యాప్ నందు ఇప్పటికే బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం కేటాయించిన మోతాదు ప్రకారమే రైతులకు యూరియా, డిఏపీ ని అందుబాటులో ఉంచామన్నారు. యూరియా 378 మెట్రిక్ టన్నులు డీఏపీ 263 మెట్రిక్ టన్నుల ఎరువులను మండల రైతులకి ఇప్పటివరకు అందించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సచివాలయ సిబ్బంది రైతులు ఉన్నారు.

# కౌలు రైతులకు ఏపీ ఏఐఎంఎస్ ద్వారా ఎరువుల పంపిణీ..ఏ.ఓ..డి మురళీధర్



**నందికొట్కూరు లక్ష్మాపురం : జూలై: 13 :(నంది పత్రిక)**పగిడ్యాల మండల పరిధిలోని రైతులకు ఏపీ ఏఐఎంఎస్ ద్వారా ఎరువుల పంపిణీ జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి డి. మురళీధర్ తెలిపారు. సోమవారం లక్ష్మాపురం గ్రామంలోని సహకార సొసైటీ ఎరువుల సముదాయాన్ని మండల వ్యవసాయ అధికారి మురళీధర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎరువుల పంపిణీ నమోదు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సీజన్ లో అవసరమైన యూరియా,డిఎపి ఎరువులను ( అగ్రికల్చర్ ఇన్పుట్ మేనేజ్మెంట్ సిస్టం) ద్వారా రైతులకు కావలసిన ఎరువులను స్థానిక ప్రైవేటు ఎరువుల దుకాణాలలో, పీఏసీలలో రైతు సేవా కేంద్రాలలో సమృద్ధిగా ఉన్నాయని కావలసినవారు విక్రయ కొనుగోలు కేంద్రాల ద్వారా ఎరువులను చేయవచ్చు అన్నారు. ప్రస్తుతం ఓటీపీ సంబంధిత సాంకేతిక సమస్యలు లేవని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏపీ ఏఐ ఎంఎస్ ద్వారా ఎరువులు కొనుగోలు చేయవచ్చు అన్నారు. ప్రభుత్వం కౌలు రైతులకు కూడా ఎరువుల పంపిణీ సౌకర్యం కల్పించిందన్నారు. అర్హత కలిగిన కౌలు రైతులు ఏపీఎఐ ఎం ఎస్ ద్వారా యూరియా, డిఎపి పొందవచ్చు అన్నారు. రైతులు ఎరువులపై ఎలాంటి ఆందోళనకు గురికావలసిన అవసరం లేదన్నారు. ఎరువుల నిలువలను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షించిందన్నారు. పంటలను బట్టి యూరియా మరియు డిఏపి బస్తాలు యాప్ ద్వారా కేటాయింపు చేయడం ఆయన రైతులకు తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా ,పత్తి మరియు వేరుశనగ పంటలకు ఈనెల 15 తేదీ వరకు పంటల బీమా చేసుకొనుటకు చివరి అవకాశం కల్పించారు. రైతులు సొంతంగా మీసేవ గాని సి ఎస్ సి సెంటర్ నందు బీమా చేసుకోవచ్చునని మండల వ్యవసాయ అధికారి డీ మురళిధర్ తెలిపారు.

# 95 శాతం సర్ ప్రక్రియ పూర్తి

## - తహసిల్దార్ ఉమారాణి



**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలో అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ 95 శాతం పూర్తి అయిందని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. సోమవారం లింగాపురం, కొక్కెరంచ, శివపురం, పెద్దగుమ్మడాపురం, చిన్నగుమ్మడాపురం, ఎర్రమఠం గ్రామాలలో తహసీల్దార్, గువ్వలకుంట్ల, వీరాపురం, గ్రామాలలో సర్ ప్రక్రియను డీప్యూటీ తహసీల్దార్ అరుణ, సీనియర్ అసిస్టెంట్ బాబుమియలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న సర్ ప్రక్రియలో ఓటర్ల జాబిత సవరణను ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు: ఆన్లైన్ చేసేటప్పుడు ఓటర్ల వివరాలు పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు. మండలంలో మొత్తం 25551 మంది ఓటర్లు ఉండగా 24480 మంది ఓటర్ల జాబిత సవరణ జరిగిందన్నారు. దీంతో 95 శాతం సవరణ పూర్తి అయిందని మిగిలిన 5 శాతం నేడు సాయంత్రానికి పూర్తి చేయిస్తామని చెప్పారు.



# ఉమామహేశ్వరున్ని దర్శించుకున్న మాజీ శాసన సభ్యులు



**బనగానపల్లె జులై 13నందిపత్రిక** సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బనగానపల్లె మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి శ్రీ యాగంటి ఉమామహేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారి దర్శనార్థం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో ఆలయ పండితులు ఘన స్వాగతం పలికారు. అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూజ ముగించిన అనంతరం ఆయనకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు. యాగంటి ఆలయ మాజీ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి,అన్నవరం మాజీ సర్పంచ్ సాయి నాథ్ రెడ్డి,పుల్లారెడ్డి తదితరులు దర్శనంలో పాల్గొన్నారు.

# హజ్ -2027 యాత్ర లో "షార్ట్" హజ్ సౌకర్యం

**తక్కువ రోజులు కావాలనుకునే వారికి అనుకూలం**

**ఆప్షన్ ద్వారా షార్ట్ హజ్ ను సద్వినియోగం చేసుకోవాలి**

**మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**

**అమరావతి, జులై 13. నంది పత్రిక:**పవిత్ర మక్కా హజ్ యాత్ర లో కుదిరించబడిన రోజులతో "షార్ట్" హజ్ యాత్ర సౌకర్యాన్ని కేంద్ర హజ్ కమిటీ కల్పించినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు.తక్కువ రోజుల వ్యవధి తో హజ్ యాత్ర పూర్తి చేయాలనుకునే వారు ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా అవకాశాన్ని పొందవచ్చని అమరావతిలో సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు.హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2027లో దాదాపు 20 రోజులకు కుదించబడిన ప్రణాళికతో షార్ట్ హజ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నదన్నారు.ఈ ప్యాకేజీలో మదీనాలో 2 లేదా 3 రోజుల బస కూడా చేర్చబడిందన్నారు. ప్రస్తుతం 35-45 రోజుల వ్యవధితో హజ్యాత్రకు,20 రోజులకు కుదిరించబడిన షార్ట్ హజ్ యాత్ర ప్యాకేజీ ధరల్లో ఎలాంటి వ్యత్యాసముండదని మంత్రి ఫరూక్ స్పష్టత ఇచ్చారు.2027 - హజ్ యాత్రలో దేశ వ్యాప్తంగా హజ్ కు వెళ్లే వారిలో గరిష్టంగా 10000 మందికి ఈ సౌకర్యం కల్పించేందుకు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుందన్నారు. 20 రోజుల వ్యవధితో షార్ట్ హజ్ కోరుకునే వారు తమ హజ్ దరఖాస్తును ఆన్ లైన్ లో సమర్పించేటప్పుడు, అందులో ఇచ్చిన షార్ట్ హజ్ ప్యాకేజీ ఆప్షన్ ను ఎంచుకోవాల్సి ఉంటుందని తెలిపారు.ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా షార్ట్ హజ్ ను పొందుపరిచిన అనంతరం, ఆన్ లైన్ లో దరఖాస్తు సమర్పించిన అనంతరం ప్యాకేజీ మార్చుకోవడానికి అవకాశం ఉండదని మంత్రి తెలిపారు.షార్ట్ హజ్ కు దరఖాస్తు చేసుకున్న యాత్రికులను లాటరీ విధానంలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. హజ్ కు ఎంపికై షార్ట్ హజ్ కు ఎంపిక కాని వారికి ఆటోమేటిక్ గా సాధారణ హజ్ పాకేజ్ (35-45 రోజులు) వర్తిస్తుందని తెలిపారు.ఒక కవర్ లోని యాత్రికులందరూ ఈ షార్ట్ హజ్ ఆప్షన్ ఎన్నుకోవలసి ఉంటుందన్నారు.ఒకే కవర్ లో రెండు ప్యాకేజీలు అనుమతించబడవని పేర్కొన్నారు.కాగా షార్ట్ హాజ్ యాత్ర ఢిల్లీ,ముంబై, బెంగళూరు,చెన్నై, హైదరాబాద్, కొచ్చిన్,కోల్ కతా,అహ్మదాబాద్ నుండి మాత్రమే నిర్వహించ బడుతుందన్నారు. హజ్ -2027 కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఈ నెల 20 వ తేదీన ముగుస్తున్నందున, గడువుకు ముందుగానే ఆన్ లైన్ ద్వారా హాజీ లు తమ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఫరూక్ సూచించారు. 20 రోజులకు కుదిరించబడిన షార్ట్ హజ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మంత్రి హాజీ లను కోరారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రంను ఎంచుకొని గన్నవరం విమానాశ్రయం ద్వారా హజ్ యాత్ర కు వెళ్లే రాష్ట్రంలోని ప్రయాణికులందరికీ కూటమి ప్రభుత్వం అందించే రూ. లక్ష ఆర్థిక సహాయం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.



# వన్యప్రాణులను వేటాడి చంపిన కేసులో ఇద్దరికీ రిమాండ్





**మహానంది జూలై 13 (నంది పత్రిక):–** వన్యప్రాణులను వేటాడి చంపిన కేసులో ఇద్దరికీ రిమాండ్ విధించినట్లు నంద్యాల ఫారెస్ట్ రేంజ్ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానంది మండలం బుక్కాపురం గ్రామం సమీపంలోని అరటి తోటలో అడవి పంది,అడవి పిల్లిని చంపిన కేసులో తిమ్మాపురం కు చెందిన దొంబర వెంకటేష్, పుట్టుపల్లెకు చెందిన దిమ్మ రమేష్, చెంచు నాగరాజు లపై వన్యప్రాణుల చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏ 1 వెంకటేష్, ఏ 2 రమేష్ లను అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా ఈనెల 27 వతేదీ వరకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఏ 3 చెంచు నాగరాజు పరారు కాగా అతని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.అటవీలో ఉచ్చులు వేయడం, పొలాల చుట్టూ కరెంటు తీగలు లాగడం,అటవీ జంతువులను వేటాడడం,వాటి మాంసం తినడం ,అమ్మడం,కొనడం చట్టరీత్య నేరమన్నారు.అటువంటి వారిపై చట్టపకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో హైమావతి, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను మూడు నెలలు పొడిగించాలి సిపిఐ

**బనగానపల్లె జులై 13నందిపత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బనగానపల్లె ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (Sా×=) ను ప్రక్రియను మరో మూడు నెలల పాటు పొడిగించాలని బనగానపల్లె తాసిల్దార్ కి సోమవారం సిపిఐ బనగానపల్లె మండల సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్రసవరణ ప్రక్రియలో అర్హులైన ఓట్ల గల్లంతు పారాలను నింపడంలో ఇబ్బందులు బిఎల్వోల అలసత్వం మరియు రాజకీయ ప్రమేయం వంటి ప్రధాన సమస్యలు వెలుగుచూస్తున్నాయి ఈనెల 14వ తేదకి రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తవుతుందని అయితే గడువు ముగింపు పూర్తి కావస్తున్నప్పటికీ చాలామంది ఓటర్ల వివరాలు నమోదు కాకపోవడం ఆందోళన కలిగిస్తుంది దేశంలో ప్రజాస్వామ్య భారతదేశంలో రాజ్యాంగం భారతీయులకు సార్వత్రిక ఓటు హక్కు కల్పించింది ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపట్టకముందే దేశ ప్రజల్లో అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయడానికి ప్రాధాన్యతమిచ్చారు ఫోటో గుర్తింపు కార్డు లేకుండా ఓటర్ జాబితాలో పేరు ఉంటే చాలు వేరే ఏదైనా గుర్తింపు పత్రంతో ఓటు వేసే వెసులుబాటు కల్పించబడింది దీనివలన భారతీయ పౌరులందరికీ ఓటు హక్కు ఉండేది దేశంలో దీర్ఘకాలం నివసించి భారతీయ పౌరసత్వం పొందిన వారు తప్ప విదేశీయులు ఎవరు ఓటు వేసేందుకు వీలు ఉండేది కాదు

కానీ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దానికి గండి కొడుతుంది మరణించిన ఓటర్ల పేర్లను శాశ్వతంగా వలస పోయిన వారిని నకిలీ ఓట్లను తొలగించడం ఎస్ఐఆర్ ఉద్దేశమని ఎన్నికల కమిషన్ చెబుతున్నప్పటికీ వాస్తవం అందుకు భిన్నంగా ఉంది ఎన్యూమరేషన్ పత్రాలను కొందరు ఆన్లైన్లో సమర్పించారు ఈ పద్ధతిలో ఓటర్ మొబైల్ ఫోన్ నెంబర్ను ఆధార్ ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డులతో అనుసంధానించాలి ఆ రెండిటిలో పేర్లు ఒకే విధంగా ఉండాలి కానీ ఎన్యూమరేషన్ పత్రాలను చేతిరాతతో నింపేటప్పుడు ఆధార్ నెంబర్ లేకపోయినా పరవాలేదు ఆన్లైన్లో ఆధార్ మిస్సైన్ తప్పనిసరి అని ఓటర్ ఆన్లైన్ లో ఎన్యూమరేషన్ స్థితిని తెలుసుకోవడానికి ఎన్నికల కమిషన్ వెబ్సైట్లను మళ్లీ తెచ్చినప్పుడు మరోసారి కొత్తఫారాన్ని నింపేలా సందేశం కనిపిస్తుంది ఓటర్లు తమ ఎనిమరేషన్ ఫారాలను బిఎల్ఓ లకు సమర్పించి అవి అప్లోడ్ అయిన సందర్భంలో మాత్రమే మీ ఫారాలను ఇప్పటికే సమర్పించారని సందేశం వస్తుంది ఆన్లైన్లో ఫారాలను సమర్పించిన వారికి మాత్రం అలాంటిది రావడం లేదు ఫోటో గుర్తింపు కార్డు ఉన్న ఓటర్లు తమ ఎపెక్స్థితి గురించి ఎన్నికల సంఘం వెబ్సైట్లో వెతికితే ఎలాంటి ఫలితం లభించలేదన్న సమాధానం వస్తుంది బహుశా వారి పేర్లను ఉద్దేశపూర్వకంగా లేదా అనుకోకుండా తొలగించి ఉండవచ్చు కొందరు ఓటర్లకు ఎపిక్ కార్డు లేకపోయినా 2002 2003 నాటి ఎస్ఐఆర్ జాబితాలలో వారి పేర్లు లేదా వారి తల్లిదండ్రుల తాతల బంధువుల పేర్లు ఉన్న వారందరూ ఈసీ పౌరసత్వం పరీక్షలో నెగ్గాలి ఉంటుంది కానీ వారికి ఎన్నిమరేషన్ ఫారాలు అందలేదు కాబట్టి వారి పేర్లు సవరించిన ఓటర్ల జాబితాలో కనిపించే అవకాశం లేదు.ఆంధ్రప్రదేశ్లో ఇప్పటివరకు చాలాచోట్ల 50 శాతం కూడా ఓటర్ల ఎనిమరేషన్ ప్రక్రియ పూర్తికాలేదు సరైన సమాచారం అందకపోవడం సాంకేతిక లోపాల వల్ల చాలామంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయాయి ప్రమాదం ఏర్పడింది ఎనిమరేషన్ ఫారాలను నింపడంలో ప్రజలకు అవగాహన లోపించడం క్షేత్రస్థాయి ఉన్న నిబంధనలు అర్థం కాకపోవడం వల్ల ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు చాలా ప్రాంతాల్లో బిఎల్వోలు ఇళ్లకు వెళ్లి సర్ పత్రాలు ఇవ్వకపోవడం సమయానికి నమోదు ప్రక్రియ పూర్తి చేయకపోవడం వంటి నిర్లక్ష్యం కనిపిస్తుంది అంతేకాకుండా విపక్షాల ఓట్లను తొలగించడానికి ఈ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్లో రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మరో మూడు నెలల పాటు పొడిగించి అర్హులైన అందరూ ఓట్ల ఆక్కున పొందే విధంగా నిర్దిష్ట చర్యలు చేపట్టవలసిందిగా కోరుతున్నాము అని అందులో పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శివయ్య సిపిఐ జిల్లా సమితి సభ్యులు సంజీవులు ఏఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రి స్వామి సిపిఐ పలుకూరు గ్రామ శాఖ కార్యదర్శి బాలయ్య మహిళా సమైక్య మండల కార్యదర్శి స్వరూప ఏఐఎస్ఎఫ్ బనగానపల్లె మండల అధ్యక్షుడు సిపిఐ నాయకులు రాధాకృష్ణ వేణు హరి పవన్ కళ్యాణ్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం .

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 112 ఫిర్యాదులు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 112 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...**

1) పెరుమాళ్ల విజయ్ కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ. 34 వేలు తీసుకుని మోసం చేశాడని కృష్ణగిరి మండలం , పుట్లూరు గ్రామానికి చెందిన ఎస్. హుస్సేన్ ఫిర్యాదు చేశారు.

2) నా కుమారుడు షణ్ముఖ మృతి పై అనుమానం ఉందని సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని ఓర్వకల్లు మండలం , హుసేనాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు.



3) సెలూన్, బ్యూటీ పార్లర్, టాటూ స్టూడియోలకు ఫ్రాంచైజీ ఇస్తామని నమ్మించి అగ్రిమెంట్ చేసుకుని, మెటీరియల్ పేరుతో రూ. 60 లక్షలు తీసుకుని హైదరాబాద్ కు చెందిన మార్కెటింగ్ మేనేజర్ బృహస్పతిరావు , నరసరావుపేటకు చెందిన ఆ(శఫ్ వలి మోసం చేశారని కర్నూలుకు చెందిన చకిత ఫిర్యాదు చేశారు.

4) నా తమ్ముడు ఫోర్జరీ చేసి నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి తనకు రావాల్సిన తండ్రి ఉద్యోగం రాకుండా మోసం చేశాడని కర్నూలు, ఎర్ర బురుజుకు చెందిన అరుణ జ్యోతయ్య ఫిర్యాదు చేశారు.

5) కొడుకు కోడలు ఆస్తికోసం వేధింపులకు గురి చేస్తున్నారని కల్లూరు కు చెందిన నాగేశ్వరావు ఫిర్యాదు చేశారు.

6) నా తమ్ముళ్ళు, మామ, అత్తల నుంచి ఉద్యోగాల పేరుతో రూ. 60 లక్షలు తీసుకొని మోసం చేసిన కల్లూరుకు చెందిన నాయకంటి మహేశ్వరి పై చర్యలు తీసుకోవాలని కల్లూరు మండలం, లక్ష్మీపురం కు చెందిన పార్వతమ్మ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా , సిఐలు శివశంకర్, ఇస్మాయిల్ , మస్తాన్ వలి లు పాల్గొన్నారు.

# పంటవేసిన ప్రతి రైతు పంట బీమా ఇన్సూరెన్స్ చేసుకోండి

**అవుకు జులై 13నందిపత్రిక** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు పంటల బీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలని అవుకు మండల వ్యవసాయ అధికారి కలిమున్నిసా తెలిపారు.సోమవారం ఏవో మాట్లాడుతూ, 202627 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పిఎం ఎఫ్ బి వై ) మరియు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంఎస్ (ఆర్ డబ్ల్యూ బి) అమలులో ఉన్నాయని చెప్పారు.నంద్యాల జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతు వాటా ప్రీమియం వివరాలు:

వరి 800 (బీమా మొత్తం₹40,000) కొర్రలు 160 పప్పుధాన్యాలు 400

ఎర్ర మిరప 280 సజ్జలు 160 జొన్నలు 190 మొక్కజొన్న 660 మినుములు 190

ఉల్లి 450 ఆముదం 160వరి పంటకు గ్రామ యూనిట్, మిగతా పంటలకు మండల యూనిట్ అమలులో ఉంటుందని తెలిపారు.

**చివరి తేదీలు:**వరి ఆగస్టు 15 మిగతా పంటలు జూలై 30 బ్యాంకు రుణం తీసుకున్న రైతుల ప్రీమియం బ్యాంకులోనే చెల్లించబడుతుంది. రుణం లేని రైతులు సియస్సీ సెంటర్ లేదా పీఎంఎఫ్ బి వై వెబ్‌సైట్ ద్వారా ప్రీమియం చెల్లించాలని సూచించారు.వాతావరణ ఆధారిత బీమా పథకం కింద:పత్తి 1600 వేరుశెనగ ₹560 అరటి 2750ఈ పథకానికి చివరి తేదీ జూలై 15 అని తెలిపారు. పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి కలిమున్నిసా సూచించారు.

## పేద మహిళ నూతన గృహం ప్రారంభించిన మంత్రి టీజీ భరత్ గుప్తా



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని 11వ వార్డు డబరాలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఖాన్ బ్రదర్స్ నిరుపేద మహిళల కోసం గృహాలు నిర్మించారు. రూ.36 లక్షల సొంత డబ్బుతో పార్వతమ్మ అనే మహిళతో పాటు రాజు అనే వ్యక్తికి నూతన గృహాలు నిర్మించారు. అనాథలైన వీరిద్దరి ఇల్లు పూర్తిగా శిథిలమైపోయిన నేపథ్యంలో ఖాన్ బ్రదర్స్ ముందుకొచ్చి వీరి కోసం ఇల్లు కట్టించారు. ఈ రెండు గృహాలను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ నాయకులు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. వీరిని చూసి మరికొందరు స్ఫూర్తి పొందాలని ఆయన సూచించారు. తమ కష్టాలు తెలుసుకొని సహాయం చేసిన ఖాన్ బ్రదర్స్ మేలు మర్చిపోలేమని మహిళ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మెహబూబ్ ఖాన్ మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్ సేవా మార్గంలో తాము నడుస్తున్నట్లు చెప్పారు.



# సార్ ప్రక్రియ మరో మూడు నెలలు పొడి గించాలి....డి ఆర్ ఓ కి సీపీఐ వినతి

**కర్నూల్ సిటీ నంది పత్రిక** సార్ ప్రక్రియ మరో మూడు మాసాలు పొడిగించాలని సీపీఐ నగర కార్యదర్శి పీ రామకృష్ణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు డీ ఆర్ ఓ వెంకటనారాయణమ్మ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓట్ల గల్లంతు, ఫారాల నింపడంలో ఇబ్బందులు, బీఎల్ వోల అలసత్వం, మరియు రాజకీయ ప్రమేయం వంటి ప్రధాన సమస్యలు వెలుగుచూస్తున్నాయి. ఈ నెల 14వ తేదీకీ రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తవుతుందని ప్రకటించారు. గడువు ముగింపు దశకు చేరుకున్నప్పటికీ ఇంకా చాలా మంది ఓటర్ల వివరాలు నమోదు కాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజాస్వామ్య భారత దేశంలో రాజ్యాంగం భారతీయులకు సార్వత్రిక ఓటు హక్కును కల్పించింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం చేపట్టక ముందు దేశ ప్రజల్లో అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయడానికి ప్రాధాన్యమిచ్చారు. ఫొటో గుర్తింపు కార్డులు లేకున్నా ఓటరు జాబితాలో పేరుంటే చాలు, వేరే ఏదైనా గుర్తింపు పత్రంతో ఓటు వేసే వెసులుబాటు కల్పించబడింది. దీనివలన భారతీయ పౌరులందరికీ ఓటుహక్కు ఉండేది. దేశంలో దీర్ఘకాలం నివసించి భారతీయ పౌరసత్వం పొందినవారు తప్ప, విదేశీయులెవరూ ఓటు వేసేందుకు వీలుండేది కాదు. కాని ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం దానికి గండికొడుతోంది. మరణించిన ఓటర్ల పేర్లను, శాశ్వతంగా వలసపోయినవారిని, నకిలీ ఓటర్లను తొలగించడం ఎస్ఐఆర్ ఉద్దేశమని ఎన్నికల కమిషన్ చెబుతున్నప్పటికీ, వాస్తవం అందుకు భిన్నంగా ఉంటున్నది. ఏపీలో ఇప్పటివరకూ చాలాచోట్ల 50% కూడా ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తికాలేదు. సరైన సమాచారం అందకపోవడం, సాంకేతిక లోపాల వల్ల చాలామంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఏర్పడింది. ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో ప్రజలకు అవగాహన లోపించడం, క్షేత్రస్థాయిలో ఉన్న నిబంధనలు అర్థం కాకపోవడం వల్ల ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా ప్రాంతాల్లో బీఎల్ వోలు ఇళ్లకు వెళ్లి సర్ పత్రాలు ఇవ్వకపోవడం, సమయానికి నమోదు ప్రక్రియ పూర్తి చేయకపోవడం వంటి నిర్లక్ష్యం కనిపిస్తోంది. అంతేకాకుండా విపక్షాల ఓట్లను తొలగించడానికి ఈ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరో 3 నెలలపాటు పొడిగించి, అర్హులైన అందరూ ఓటు హక్కు పొందేవిధంగా నిర్దిష్ట చర్యలు చేపట్టవలసిందిగా కోరుతున్నాము డిఆర్ఓ ని కలిసిన వారిలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి సి. మహేష్ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు భద్రకుమార్ అశోకు యూత్ ఫెడరేషన్ నాగరాజు తదితరులు డిఆర్ఓ ని కలిసిన వారిలో ఉన్నారు.



## కర్నూలు గ్రామీణ సచివాలయంలో యస్ఐఆర్ తనికి చేసిన కర్నూల్ రూరల్ యంఆర్ఓ రమేష్ బాబు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ రూరల్ మండలం బాలాజీనగర్ 103 వ సచివాలయం నందు రూరల్ యంఆర్ఓ రమేష్ బాబు ఆధ్వర్యంలో యస్ఐఆర్ పై జరుగుతున్న సమీక్ష సమావేశం 25 భూతులను తనికి నిర్వహించారు సచివాలయ సిబ్బంది భానుప్రకాష్ సుమలత తో పాటుగా బిజెపి యస్సి మోర్చా రాష్ట్ర నాయకులు వేల్పుల గోపాల్ పాల్గొని మాట్లాడుతూ మండలంలో గల అన్ని భూతులలో త్వర తగతిన పూర్తి చేయాలని సమయం చాల తక్కువగా ఉన్నదని కనుక సిబ్బంది కూడ పెంచే ప్రయత్నం చేస్తామని యంఆర్ఓ రమేష్ బాబు వివరించారు కనుక ప్రతి ఒక్క ఓటరు సద్వినియోగం చేసుకొని అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో కోడుమూరు రూరల్ మండల అధ్యక్షులు బెస్త ఈరన్న భూతు అధ్యక్షులు కురువశివ మహేష్ టిడిపి నాయకులు ఈరన్నగౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలి



## అర్జీదారులతో నేరుగా మాట్లాడి సంతృప్తికరంగా సమస్యలు పరిష్కరించాలి
## వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయండి
## పీజీఆర్ఎస్‌లో 334, రెవెన్యూ క్లినిక్స్‌లో 193 అర్జీల స్వీకరణ
## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూలై 13(నంది పత్రిక):-** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం వివిధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తోందని తెలిపారు. అర్జీల పరిష్కారంపై అర్జీదారుల సంతృప్తి స్థాయిని ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా సమీక్షిస్తోందని పేర్కొన్నారు. అధికారులు కేవలం నివేదికలు సమర్పించడమే కాకుండా, అర్జీదారులను వ్యక్తిగతంగా కలిసి సమస్యను వివరించి పరిష్కరించే విధంగా వ్యవహరించాలని సూచించారు. దీనివల్ల ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. నంద్యాల రూరల్ తహశీల్దార్ పరిధిలో ఇనాం భూమిని పట్టా భూమిగా మార్చి అర్జీదారుడి సమస్యను పరిష్కరించడం ప్రశంసనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. మరోవైపు జూపాడుబంగ్లా మండలంలో ఒక అర్జీకి సంబంధించి తప్పు సమాచారం అందించిన ఘటనను ప్రస్తావిస్తూ, ఇలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అలాగే నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుపై కమిషనర్ స్వయంగా అర్జీదారుని కలిసి వివరణ ఇవ్వడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. అర్జీదారులకు అందించే పరిష్కార నివేదికలపై సంబంధిత అధికారులు తప్పనిసరిగా సంతకం చేయాలని కూడా కలెక్టర్ స్పష్టం చేశారు.

**వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతంగా వినియోగించాలి** ప్రభుత్వ సేవలను ప్రజలకు ఇంటి వద్ద నుంచే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం సుమారు 1,500 ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డులకు వచ్చే ప్రతి పౌరునికి ఈ సేవలపై అవగాహన కల్పించి, కార్యాలయాలకు రాకుండానే ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 193 అర్జీల స్వీకరణ** భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ప్రజలకు సమర్థవంతమైన వేదికగా నిలుస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్స్‌లో మొత్తం 193 అర్జీలు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 3, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 4, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 39, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 73, సర్వే, రీ-సర్వే అంశాలకు సంబంధించినవి 61, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 13 అర్జీలు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు.

**పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ముఖ్యమైన అర్జీలు** 1)జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామానికి చెందిన రాజా గౌడు, సర్వే నంబరు 542/బిలో ఉన్న 2.52 ఎకరాల భూమి చుక్కల భూమిగా నమోదైందని, దానిని పట్టా భూమిగా మార్చాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 2)ఆళ్లగడ్డ మండలం బాచాపురం గ్రామానికి చెందిన అన్నెం కాశీ విశ్వనాథరెడ్డి, జి. జంబులదిన్నె గ్రామంలోని సర్వే నంబరు 300/2లో తనకు ఉన్న 3.60 ఎకరాల భూమికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. 3)కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామానికి చెందిన ఎం. దిబ్బన్న, సర్వే నంబరు 1172లోని తన భూమిని ఇతరులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.




## జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆకస్మిక సందర్శన

**ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 13 నంది పత్రిక** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షరాన్ సోమవారం నాడు రాత్రి ఆళ్లగడ్డ అర్బన్ పోలీస్ స్టేషన్ సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆళ్లగడ్డ పట్టణ డిఎస్పి శ్రీనివాసరావు సిఐలు నాగరాజరావు ,బీవీ రమణ , ఎస్ఐలు పీరయ్య వరప్రసాద్ తో ఆళ్లగడ్డ పట్టణ రూరల్ సంబంధించిన పలు విషయాలపై చర్చించారు.



# జలధార-జలహారతి పనులు వేగవంతం చేయాలి





## జిల్లాలకు రూ.2 కోట్ల నిధుల విడుదలకు ముఖ్యమంత్రి ఆదేశాలు


## రాష్ట్రవ్యాప్తంగా జలధార కార్యక్రమ పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష

## నంద్యాల జిల్లాలో చేపట్టిన పనుల వివరాలను వివరించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూలై 13(నంది పత్రిక):-** జలధార-జలహారతి కార్యక్రమం అమలు పురోగతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టు సైట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల వృద్ధి, సాగునీటి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా మాట్లాడుతూ, జిల్లాలో జలధార - జలహారతి కార్యక్రమం కింద చేపట్టిన చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ చానళ్ల అభివృద్ధి, భూగర్భ జలాల వృద్ధికి చేపట్టిన పనుల పురోగతిని రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. జూన్ నెల నుండి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన వర్షపాతం సాధారణ వర్షపాతంతో పోలిస్తే తక్కువగా ఉన్నప్పటికీ, వర్షపు నీటిని గరిష్టంగా ఒడిసిపట్టేలా చేపట్టిన జలధార - జలహారతి పనులు ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గుర్తించిన జలధార పనుల్లో ఇప్పటికే 97 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా నిర్దేశిత గడువులో పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, చెరువుల సామర్థ్యాన్ని పెంపొందించడం, భూగర్భ జలాలను పునరుజ్జీవింపజేయడం, సాగునీటి లభ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఆమె సియం కు వివరించారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువతో పాటు ఇతర ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సాగునీటి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో వచ్చే మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టుల అమలుకు రూ.35,313 కోట్లు వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అదేవిధంగా, ఏపీఎస్ఐడీసీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,023 సాగునీటి పథకాల పునరుద్ధరణ పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పనులకు రూ.3,883 కోట్ల వ్యయం అంచనా వేయగా, వీటి ద్వారా సుమారు 8.42 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉందని అధికారులు వివరించారు. జలధార కార్యక్రమం కింద 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 11,133 చెరువులు, ఫీడర్ చానళ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. జలధార పనులను వీబీజీ రామ్‌జీ సంస్థ ద్వారా మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, జలధార కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసేందుకు ప్రతి జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున అదనపు నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ, ఇరిగేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శంకర్ రెడ్డి, భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రఘురాం తదితర అధికారులు పాల్గొన్నారు.

# జల్ సంచాయ్ - జల్ భాగిధారీలో వేగం పెంచాలి





## జలధార - జలహారతి విజయంతో జిల్లాకు సీఎం ప్రశంసలు

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూలై 13(నంది పత్రిక):-** జల్ సంచాయ్ -జల్ భాగిధారీ కార్యక్రమంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయడంతో పాటు, జలధారజలహారతి కార్యక్రమంలో సాధించిన విజయాన్ని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. జలధార - జలహారతి పనులను సమయానికి పూర్తి చేసినందుకు జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించినట్లు ఆమె తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్, జల్ సంచాయ్జ-ల్ భాగిధారీ, జలధార -జలహారతి కార్యక్రమాల పురోగతిపై ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో భూగర్భ జలాల శాఖ అధికారి రఘురాం, డ్వామా పీడీ సూర్యనారాయణమూర్తి, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ కోఆర్డినేటర్ అంకిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్, జల్ సంచాయ్ - జల్ భాగిధారీ కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను మరోసారి పరిశీలించి, నాణ్యమైన ఫోటోలను మాత్రమే అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపికైన 50 జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో మొదటి బహుమతిగా రూ.2 కోట్లు, రెండో బహుమతిగా రూ.1 కోటి, మూడో బహుమతిగా రూ.50 లక్షలు, నాలుగో బహుమతిగా రూ.25 లక్షలు అందజేస్తారని పేర్కొన్నారు. జలధార - జలహారతి కార్యక్రమంలో జిల్లాకు మొత్తం 2,031 పనులు మంజూరు కాగా, వాటిలో 1,960 పనులు నిర్దేశిత గడువులో పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 71 పనులను ఆత్మకూరు, బండి ఆత్మకూరు, ఆళ్లగడ్డ మండలాల్లో అత్యంత వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల ద్వారా గతంతో పోలిస్తే భూగర్భ జలాల నిల్వ సామర్థ్యం ఎంత మేర పెరిగింది, నీటి రీచార్జ్ సామర్థ్యంలో ఎలాంటి మార్పు వచ్చింది అనే అంశాలను కూడా శాస్త్రీయంగా పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వివరాలు భవిష్యత్ నీటి వనరుల ప్రణాళికకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అదేవిధంగా వీబీ రామ్‌జీ పనులకు సంబంధించి ఈ నెలకు రూ.8.40 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. లక్ష్య సాధన కోసం అధిక సంఖ్యలో ఉపాధి శ్రామికులు పనులకు హాజరయ్యేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# రైతులు నష్టపోకుండా చూడటమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం : జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

## రైతులు స్వచ్ఛందంగా పంట బీమా ప్రీమియంలు చెల్లించి, ఆర్థిక రక్షణ పొందాలి.

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ఎల్‌నినో ప్రభావంతో అనావృష్టి కారణంగా ఈసారి జిల్లాలో పంట దిగుబడి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నందున, రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంట బీమా చక్కని అవకాశమని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 1,54,000 హెక్టార్లలో ప్రత్తి పంట వేయడం జరిగిందని తెలియజేశారు. రైతులు పత్తి పంటకు ఎకరాకు రూ.2,000/- ప్రీమియం చెల్లించడం ద్వారా సుమారుగా రూ.40 వేలు, వేరుశనగ పంటకు ఎకరాకు రూ.566/- ప్రీమియం చెల్లించడం ద్వారా సుమారుగా రూ.28 వేలు, ఉల్లి పంటకు ఎకరాకు రూ.90/- ప్రీమియం చెల్లించడం ద్వారా సుమారుగా రూ.45 వేలు, కందులు ఎకరాకు రూ.44/- ప్రీమియం చెల్లించడం ద్వారా సుమారుగా రూ.22 వేలు పంట బీమా పొందే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో మిర్చి పంట 1,800 హెక్టార్లలో వేయడం జరిగిందని, ఎకరాకు రూ.360/- ప్రీమియం చెల్లించడం ద్వారా సుమారుగా రూ.90 వేల పంట బీమా పొందే అవకాశం ఉందని తెలిపారు. పత్తి, వేరుశనగ పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు జూలై 15, మిగతా అన్ని పంటలకు జూలై 31 చివరి తేదీ అని తెలియజేశారు. స్వచ్ఛందంగా పంట బీమా ప్రీమియంలు చెల్లించడం ద్వారా రక్షణ పొందగలిగే ఈ సదవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



## డిలిమిటేషన్ తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి

### ఏపీ మహిళా సమాఖ్య



**కర్నూల్ సిటీ నంది పత్రిక** డీ లిమిటేషన్, జనగణనతో సంబంధం లేకుండా వచ్చే పార్లమెంట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదింప చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ,శ్రావణి లు డిమాండ్ చేశారు మహిళా రిజర్వేషన్ బిల్లును ఎలాంటి షరతులు లేకుండా వెంటనే ఆమోదింప చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కర్నూల్ కలెక్టర్ కార్యాలయం దగ్గర ఉన్న పోస్ట్ బాక్స్ నుండి ప్రధాని నరేంద్ర మోడీకి రక్తంతో వేలిముద్రలు వేసి పోస్ట్ కార్డులు పంపించారు ఈ కార్యక్రమానికి ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి వి భారతి అధ్యక్షత జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగిడ్డమ్మ,శ్రావణి లు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతుని అని పైకి మొసలి కన్నీరు కారుస్తూ దానిని అమలు చేయకుండా డి లిమిటేషన్స్ ముడిపెట్టి తాను మన ధర్మ సిద్ధాంతం ప్రకారం మహిళలను వంటింటికే పరిమితం చేసేందుకు కుట్ర పండుతుందని బిజెపికి మహిళల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న 33% రిజర్వేషన్ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించాలని అలాకాకుండా మహిళలను మోసం చేసే విధంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తే ఆంధ్రప్రదేశ్ మహిళా సామాఖ్యగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఇప్పటికే సంతకాల సేకరణ జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని ఇప్పుడు రక్తంతో ప్రధానికి పోస్ట్ కార్డులు పంపిస్తున్నామని దీనిపైన స్పందించకపోతే మహిళా శక్తిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి చవిచూపిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య నగర నాయకురాలు పావని, రేణుక, ఆశా బేగం, మునెమ్మ, కోటమ్మ, రజియా, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ సర్వే ను తనిఖీ చేసిన... రెవిన్యూ డివిజనల్ అధికారి వెంకట శివ



**జూపాడుబంగ్లా: జులై :13: (నంది పత్రిక )** తాసిల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి, ఆత్మకూరు మరియు ఎలక్షన్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ , 136 అసెంబ్లీ నియోజకవర్గం నందికొట్కూరు (యస్ సి) వెంకట శివ గారు జూపాడుబంగ్లా మండలంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను తనిఖీ చేసి తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్లు, డిప్యూటీ ఎంపిడిఓ లతో సమావేశమై పర్యవేక్షించడం జరిగింది. ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్లు లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫామ్స్ అన్నింటినీ సేకరించి డిజిటలైజేషన్ చేయాలని ~ూణ (అబ్సెంట్ , డెత్, షిఫ్ట్, మైగ్రేషన్)లిస్ట్ ఎటువంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని , సూచించడమైంది. తహశీల్దార్ మరియు డిప్యూటీ తహశీల్దార్లు కూడా మండలంలోని పారుమంచాల,80 బన్నూరు,జూపాడుబంగ్లా, తాటిపాడు గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేయడం జరిగింది. జూపాడుబంగ్లా మండలం లోని 33 పోలింగ్ బూతులలో 30657 ఎన్యూమరేషన్ ఫామ్స్ 100% డిజిటలైజేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు జరిగింది అన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ పార్వతమ్మ



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 13 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని విశ్వరూప నగర్ లో వెలసిన శ్రీ కాళికా మాత అమ్మవారిని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ పార్వతమ్మ సోమవారం నాడు ఉదయం దర్శించుకున్నారు ఆళ్లగడ్డ చేరుకున్న ఆమెకు గజమాలతో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందడానికి ప్రత్యేక ప్రోత్సాకాలు అందిస్తుందని పదిమంది సభ్యులు గ్రూపుగా ఏర్పాటు చేసుకొని వ్యాపార రంగంలో ముందుకు వస్తే అందుకు సహకరించడానికి మేము సిద్ధంగా ఉన్నామని ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పెద్ద సుబ్బయ్య ఆచారి తునికి పాటి కోటేశ్వరరావు బాణాల గోపాల ఆచారి ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ ఆచారి సంఘం సభ్యులు కమిటీ ఉపాధ్యక్షుడు సురేష్ ఆచారి రామాచారి మహిళా కమిటీ సభ్యులు కే విశాలాక్షి హరీష రాజీ విజయ విశ్వబ్రాహ్మణ సభ్యులు పాల్గొన్నారు.



# “దెందులూరు నియోజకవర్గ సమగ్ర ప్రణాళికా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి:





**ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెల్లడి.**

**- ఎమ్మెల్యే చింతమనేనిని మర్యాదపూర్వకంగా కలసిన జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి (సిపిఓ) కె. శ్రీనివాస్.**

**దుగ్గిరాల బ్యూరో చీఫ్ జూలై 13 నందిపత్రిక** క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం నిత్య ప్రజా దర్బార్ - ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించి సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు.దెందులూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో నిత్య ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగింది. పలువురు కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ముఖ్య ప్రణాళిక విభాగం అధికారి( సిపిఓ) గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కే.శ్రీనివాస్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నూతన సీపీఓ అభినందనలు తెలుపుతూ.. దెందులూరు నియోజకవర్గ పరిధిలో జిల్లా ప్రణాళికా విభాగం తరఫున చేపట్టవలసిన పలు ముఖ్యమైన అభివృద్ధి పనులు, నిధుల మంజూరు ప్రక్రియ మరియు భవిష్యత్ కార్యాచరణపై చర్చించి పలు కీలక సూచనలు చేశారు. నియోజకవర్గ ప్రగతికి ప్రణాళికా విభాగం నుండి పూర్తి సహకారం అందించాలని కోరారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు..

# అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి





**ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌లో అందిన ఫిర్యాదులు క్షేత్రస్థాయి సిబ్బందితో జిల్లా అధికారులు నిరంతరం సమీక్షించుకుంటూ దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలి. పీజీఆర్ఎస్‌లో 187, రెవెన్యూ క్లినిక్‌లో 48 దరఖాస్తుల స్వీకరణ . జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో బ్యూరో చీఫ్ జూలై 13 నంది పత్రిక**

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌లలో అందుతున్న ప్రతి ఫిర్యాదును నిబంధనల మేరకు నిర్దేశిత గడువు లోపల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ కె. ఆర్. కల్పశ్రీ, ఇంచార్జి రెవెన్యూ అధికారి పి. ప్రభాకర్, పీజీ ఆర్ ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జడ్. వెంకటేశ్వర్లు, తదితర అధికారులు పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కేవలం అర్జీలను క్లోజ్ చేయడం ముఖ్యం కాదని, క్షేత్రస్థాయిలో అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. అధికారులు రీ–ఓపెన్ (మళ్లీ వచ్చే) అర్జీల సంఖ్య తగ్గాలని అన్నారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యల తీవ్రత, వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని అన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఒకే సమస్యపై ప్రజలు మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారాలపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 187 దరఖాస్తులు, అలాగే రెవెన్యూ క్లినిక్‌లో 48 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

పాలకొల్లు మండలం, గోరింటాడ గ్రామంలో మంచినీళ్ళ చెరువు, పశువుల చెరువును తలపిస్తుందని తక్షణం శుద్ధి చేసి త్రాగునీటి ఫిల్టర్ ప్లాంట్ పునరుద్ధారణ చేసి గ్రామస్తులకు మంచినీళ్లు అందించాలని గ్రామానికి చెందిన పార్సి స్వర్ణ కుమార్ కోరారు. భీమవరం మండలం రాయలం గ్రామం కాపురస్తులు తాటడిపర్తి లక్ష్మి కాంతం, తాడిపర్తి అమ్ములు, తాడిపర్తి ఏసు పాదం , కె. కుమారి, తదితరులు సన్నా, చిన్న కారు రైతులు మా పూర్వీకుల నుండి మా పొలము వరి పంట పండించుకుంటూ జీవించుచున్నాము. మా పొలాలకు ఉత్తరం, దక్షిణం మధ్యలో చెల్లుబోయిన సత్యనారాయణ వ్యవసాయ భూమిని రొయ్యలు చెరువుగా తవ్వి గట్లు ఏర్పాటు చేశారు. రొయ్యల చెరువు సాగు వలన మా పంట భూములు సౌడు భూములుగా మారి భారీ పంట నష్టము జరుగుతుంది. తక్షణం చర్యలు తీసుకొని రొయ్యల చెరువు సాగు కాకుండా చూడాలని కోరారు. గణపవరం మండలం, పిప్పర గ్రామం నుండి కొడమంచిలి మంగమ్మ భర్త వెంకట్రావు మాకు ఇద్దరు సంతానము కుమారుడు, కుమార్తె, వారికి విద్యా బోధనలు నేర్పించి వివాహములు చేసి యున్నాము నా కుమారుడు ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్లో ఉద్యోగం కూడా చేస్తున్నాడు అప్పులు చేసి మరి ఒక ఇల్లు నిర్మించి నా కుమారుడికి ఇవ్వటం జరిగింది. నా భర్త అనారోగ్యం తో బాధపడుతున్న సమయంలో మమ్ములను చూడకుండా వేరే చోట ఉంటూ మా కనీస అవసరాలకు ఏమి ఇవ్వకుండా మాపై భౌతికంగా దాడులు చేసి హింసిస్తున్నాడు. చర్యలు తీసుకుని న్యాయం చేయాలి అని కోరారు. అత్తిలి మండలం తిరుపలిపురం గ్రామం నుండి వర్ధినిడి ఈశ్వరరావు నాకు అత్తిలి గ్రామంలో 84/3ూ 84/3దీ 100 సెంట్లు భూమి యున్నది. ప్రభుత్వం చేసిన రీ సర్వే అనంతరం ఇచ్చిన పట్టాలో 92 సెంట్లు భూమి మాత్రమే నమోదు చేసి ఉన్నారు. ఎంక్వైరీ చేయగా సరిహద్దు పొలంలో నా భూమి కలిసినదని తెలిసినది. మరలా సర్వే చేయించి పూర్తి భూమిని అప్పగించాలని కోరారు.పెనుమంట్ర మండలం పెనుమంట్ర గ్రామం చెందిన కర్రీ వెంకటరెడ్డి 38 సంవత్సరాలు (వికలాంగుడు) తనకు ఎటువంటి ఆదాయము లేదు వికలాంగ పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఎలమంచిలి మండలం, పెనుమదం గ్రామం అప్పి చెరువు గ్రామ కాపురస్తులు కోలాటి సూర్యకాంతం మరియు కోలాటి నాగేశ్వరరావు, వీరవాసరం మండలం మడుగు పోలవరం గ్రామం రెవిన్యూ పరిధిలో మాకు కొంత వ్యవసాయ భూమి ఉన్నది మా బంధువైన పార్సి ప్రభాకర్ రావు మా భూమిని కౌలుకు చేస్తున్నాడు మేము వృద్ధులు మై ఉండుట వలన తరచూ మా భూమి కి వచ్చి చూసుకోలేక పోయేవారము ఇదే అదునుగా చూసుకుని పార్సి ప్రభాకర్ రావు అతని కుమారుడు కలసి మా భూములోనికి మమ్మును రానీయకుండా అడ్డుపడుచు మాపై దౌర్జన్యం చేస్తున్నారు. వారి నుండి మాకు రక్షణ కల్పించి మా భూమిని మాకు ఇప్పించాలని కోరూతు దరఖాస్తు. వయోవృద్ధులు, వికలాంగులు, నడవలేనివారు తమ పరిధిలోని మండలాల్లో అధికారులకు తమ సమస్యల అర్జీలను దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. పరిష్కరించ దగ్గ ప్రతి అర్జీని కచ్చితంగా పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు.అనంతరం పి జి ఆర్ ఎస్ అర్జీలపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమంలో ఎక్కువ శాతం రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్ మున్సిపల్ శాఖలకు సంబంధించినఅర్జీలు ఎక్కువగా వస్తున్నా యని కలెక్టర్ చెప్పారు. ప్రజల నుండి వచ్చిన అర్జీల కునాణ్యమైన పరిష్కా రం చూపాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వం విధించిన గడువు లోగా అర్జీలను పరిష్కరించాలని చెప్పారు.అనంతరం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతి కుటుంబం లోఇద్దరూ లేక ముగ్గురు పిల్లలు ఉండే విధంగా ప్రజల ను ప్రోత్స హించాలని అధికారులకు చెప్పారు.ఈ సందర్భం గా పిల్లలే సంపద అనే పోస్టర్లను కలెక్టర్ ఆవిష్క రించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీ దారులు తదితరులు పాల్గొన్నారు.






# ఎల్‌నినో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు పీఎండీఎస్ ను అవలంబించాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు జిల్లాలో 92000 ఎకరాల్లో పీఎండిఎస్ లక్ష్యంగా నిర్దేశం.**

**పిఎండిఎస్ తోనే ప్రధాన పంటకు రక్షణ.**




**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ఎల్‌నినో వల్ల జిల్లాలో వర్షాలు చాలా తక్కువగా పడుతున్నాయని కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. సుమారుగా పదిహేను రోజుల నుంచి జిల్లాలో వర్షాలు ఎక్కువ పడలేదు కాబట్టి, ఎల్‌నినో ప్రభావం నుండి బయటపడాలంటే రైతులందరూ ప్రి మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనె గింజలు మొదలగు 36 రకాల గింజలు జీవామృతంతో శుద్ధి చేసుకుని, మట్టి, బూడిదతో కలిపి చేలల్లో చెల్లుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. పిఎండిఎస్ మిశ్రమం వర్షం పడేంత వరకు చేన్లలో అలాగే ఉంటుందని తెలిపారు. వర్షం పడినప్పుడు మిశ్రమంలోని గింజలు మొలకెత్తి, ప్రధాన పంట రక్షించబడుతుందని తెలియజేశారు. పిఎండిఎస్ వలన భూసారం పెరిగి, నీటిమట్టం రక్షించబడి, ప్రధాన పంటకు నీడ అందుతుందని వివరించారు. పిఎండిఎస్ వలన వర్షం తక్కువ పడినా, ఎక్కువ పడినా ప్రధాన పంటకు లాభంచే విధంగా ఉంటుందని స్పష్టం చేశారు. పిఎండిఎస్ వలన ప్రధాన పంటకు 15 రోజుల పాటు నీరు లేకపోయినా ఇబ్బంది లేకుండా ఉంటుందని వెల్లడించారు. ప్రధాన పంట రక్షించబడటం మాత్రమే కాకుండా, పీఎండిఎస్ లో భాగంగా చెల్లిన మిశ్రమం నుండి మొలకెత్తిన పంటను పశుగ్రాసంగా వాడుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో 92,000 ఎకరాల్లో పీఎండిఎస్‌ను లక్ష్యంగా నిర్దేశించామని, 86% అంటే 74,000 ఎకరాల్లో పీఎండిఎస్‌ను పూర్తి చేయగలిగామని తెలిపారు. ఇప్పటికి కురిసిన అత్యల్ప వర్షాలకే పీఎండిఎస్ బాగా మొలకెత్తాయని, పత్తి ప్రధాన, ఏకైక పంటగా సాగు చేస్తున్న రైతులందరూ పిఎండిఎస్ పద్ధతిని అవలంబించాలని సూచించారు. పిఎండిఎస్ లో అన్నీ కాకపోయినా కనీసం కొన్ని రకాల గింజలను వేసుకున్నా రైతులకు లాభదాయకంగా ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాలో మరో లక్ష ఎకరాల్లో పిఎండిఎస్, ట్యాంక్ బెడ్‌లలో పశుగ్రాసం సాగు చేయించాలని కలెక్టర్ ఇరిగేషన్, పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.

# పాఠశాల వద్ద వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి ఎస్ డి పి ఐ




**నంది పత్రిక ఆత్మకూరు..** నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరులో ని నంద్యాల రోడ్డు లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత ఉర్దూ పాఠశాల ఎదురుగా విద్యార్థుల భద్రత దృష్ట్యా వెంటనే స్పీడ్ బ్రేకర్లు మరియు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్ డి పి ఐ డిమాండ్ చేస్తూ ఉన్నతాధికారులకు మెమరాడం ఇస్తూ తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎస్ బి పి ఐ శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ కమిటీ సభ్యులు జబివుల్లా ఆత్మకూరు టౌన్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఖపీఎం సూర్య ఘర్ పథకం అమలును వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్ జూలై 13 నంది పత్రిక**పీఎం సూర్య ఘర్ ఎస్సీ, ఎస్టీ యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ (యు ఎల్ ఎ) పథకం అమలును మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.పీఎం సూర్య ఘర్ పథకం అమలుపై సోమవారం జిల్లా కలెక్టరేట్, వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి. ఉషారాణి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ శ్రీమతి చదలవాడ నాగరాణి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా జిల్లాలో విస్తృతంగా అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. అధిక సంఖ్యలో వినియోగదారులు ఈ పథకాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ పథకం ద్వారా 1 కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల వరకు సామర్థ్యం గల సౌర విద్యుత్ (సోలార్) ప్యానెల్లు ఏర్పాటు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం గరిష్టంగా రూ.78,000 వరకు సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. ప్రజలు తమకు అవసరమైన విద్యుత్‌ను తమ ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకున్న సౌర విద్యుత్ వ్యవస్థ ద్వారా స్వయంగా ఉత్పత్తి చేసుకుని, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని అన్నారు. ఈ విధంగా నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందే అవకాశం ఉందన్నారు. పథకం అమలును సమీక్షిస్తూ భీమవరం, పెదతాడేపల్లిగూడెం సబ్ డివిజన్స్ లో పురోగతిని మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా పురోగతిని అత్యుత్తమ స్థాయిలో నిలిపేలా ప్రత్యేక దృష్టి సాధించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 8,705 మంది విద్యుత్ వినియోగదారులు మొత్తం 27.66 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ (సోలార్) ప్యానెల్లు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పీఎం సూర్య ఘర్ పథకంలోని ఎస్సీ, ఎస్టీ యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ (యు ఎల్ ఎ )డల్ కింద ఇప్పటివరకు 6,271 మంది ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు 12.5 మెగావాట్ల సామర్థ్యంతో ఉచిత సౌర విద్యుత్ ప్యానెల్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.పీఎం సూర్య ఘర్ ఎస్సీ ఎస్టీ యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్( యు ఎల్ ఏ) పథకం అమలును మరింత వేగవంతం చేసేలా ఎంపిక చేయబడ్డ కాంట్రాక్టర్ ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పని పూర్తి చేసేలా పర్యవేక్షించాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.ఉషారాణి, ఇఇ లు, డిఇ లు తదితరులు పాల్గొన్నారు.



నంది పత్రిక



# సిరిసిల్ల ప్రగతి ప్రస్థానం: నాడు ఆత్మహత్యల నిలయం.. నేడు దేశానికే దిక్సూచి!

ఒకప్పుడు ఆ నియోజకవర్గం పేరు వింటేనే గుండె తరుక్కుపోయేది. చేనేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి కేకలు, వలసల చీకట్లు ఆ ప్రాంతాన్ని కమ్మేసాయి. నేతన్నల మగ్గాల చప్పుడు కంటే, వారి కుటుంబాల రోదనలే ఎక్కువగా వినిపించేవి. కానీ, కాలం మారింది, నాయకత్వం మారింది. నాటి సంక్షోభాల నిలయం, నేడు దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఈ మహా పరివర్తన వెనుక ఉన్న ఏకైక సంకల్ప శక్తి, సిరిసిల్ల శాసనసభ్యుడు కల్వకుంట్ల తారక రామారావు. సిరిసిల్ల రూపురేఖలను మార్చి, నేతన్నల జీవితాల్లో ప్రగతి వెలుగులు నింపిన ఆయన అద్భుత ప్రస్థానంపై(తెలంగాణ పత్రిక) ప్రత్యేక కథనం. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సిరిసిల్ల అంటే సంక్షోభానికి నిలువుటద్దం. అప్పుల బాధతో, ఉపాధి లేక వందలాది మంది చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అయితే, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సిరిసిల్ల నియోజకవర్గ బాధ్యతలను ఆయన స్వీకరించారు. కేవలం ఒక ప్రజాప్రతినిధిగా కాకుండా, ఆ ప్రాంత బిడ్డగా సిరిసిల్ల కష్టాలను శాశ్వతంగా తీర్చడమే తన ప్రథమ కర్తవ్యంగా భావించారు. కార్మికుల ఆకలి చావులను అరికట్టడమే లక్ష్యంగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల దుస్తులు, బతుకమ్మ చీరల తయారీ బాధ్యతలను సిరిసిల్ల నేతన్నలకే ఇస్తూ వారికి ఏడాది పొడవునా స్థిరమైన ఉపాధి కల్పించారు. చేనేత రక్షణ నిధి పథకం ద్వారా కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించారు. నూలు, రసాయనాలపై రాయితీలు అందించి మగ్గాల నిర్వహణ భారాన్ని తగ్గించారు. పాత మగ్గాల స్థానంలో ఆధునిక విద్యుత్ మగ్గాలు ప్రవేశపెట్టి, తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం పొందేలా కార్మికులను సాంకేతికంగా బలోపేతం చేశారు.



సిరిసిల్లను అంతర్జాతీయ వస్త్ర కేంద్రంగా మార్చాలనే సంకల్పంతో ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో వస్త్ర పరిశ్రమల క్లస్టర్లను, దుస్తుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీనివల్ల వేలాది మంది స్థానిక మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు లభించాయి. ఒకప్పుడు బతుకుదెరువు కోసం ముంబై, సూరత్ వంటి నగరాలకు వలసలు పోయిన సిరిసిల్ల బిడ్డలు, నేడు స్వగ్రామానికి తిరిగి వచ్చి సగర్వంగా జీవిస్తున్నారు. కేవలం వస్త్ర పరిశ్రమనే కాకుండా, సిరిసిల్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారు. ఉన్నత సాంకేతిక విద్యా సంస్థలతో పాటు అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను తీసుకువచ్చి స్థానిక విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు. అత్యాధునిక వసతులతో కూడిన ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలను ఏర్పాటు చేసి, పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. సుందరమైన రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ ద్వారా సిరిసిల్ల నియోజకవర్గ పల్లెలను ప్రగతి నిలయాలుగా మార్చారు. కార్మికుల అంతరంగం పరిశీలిస్తే, ఒకప్పుడు మా బతుకులు చీకటి, చావడమే మాకు దిక్కు అనుకున్నాం, కానీ మా శాసనసభ్యుడు వచ్చిన తర్వాత మా మగ్గాలకు జీవం వచ్చింది, చేతులకు నిండా పని దొరికింది, ఇప్పుడు మేము ఎవరి ముందర చెయ్యి చాపడం లేదు, గౌరవంగా బతుకుతున్నాం అని సగర్వంగా ప్రకటిస్తున్నారు. సమర్థవంతమైన నాయకత్వం ఉంటే ఎలాంటి వెనుకబడిన ప్రాంతాన్నైనా ప్రగతి పథంలో నడిపించవచ్చని ఆయన నిరూపించారు. ఆకలి చావుల సిరిసిల్లను, ఆదర్శ సిరిసిల్లగా మార్చిన ఆయన కృషి అనన్యసామాన్యం. కేంద్ర ప్రభుత్వ అవార్డులు, దేశవ్యాప్త ప్రశంసలే దీనికి నిదర్శనం. సంకల్ప బలం, నిరంతర శ్రమ ఉంటే అసాధ్యమైనది ఏదీ లేదని చాటిన ఆయన ప్రస్థానం, నవ తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది.

# రుతుపవనాలు ముఖం చాటేశాయా? తెలుగు రాష్ట్రాల్లో 40 డిగ్రీలు దాటుతున్న ఎండలు..

చైనాలోని బావి తుఫాన్ ప్రభావంతో భారత రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రుతుపవన గాలులు దక్షిణ చైనా సముద్రం వైపు మళ్లడంతో భారత్‌కు తేమగాలుల రాక తగ్గి, బంగాళాఖాతంలో అల్పపీడనాల ఏర్పాటుకు ఆటంకం కలుగుతోంది. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు తగ్గి ఎండల తీవ్రత పెరిగింది. ఏపీలో ఇప్పటివరకు 25 శాతం వర్షపాతం లోటు నమోదవగా, పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయిజులై 13: చైనాలోని బావి తుఫాన్ ప్రభావం.. భారత రుతుపవనాలపై తీవ్ర ప్రభావంగా పడనుంది. రుతుపవన గాలులు దక్షిణ చైనా సముద్రం వైపు మళ్లినట్లు వాతావరణ నిపుణుల అంచనా వేస్తున్నారు. భారత్ వైపు తేమగాలుల రాక తగ్గడంతో.. బంగాళాఖాతంలో అల్పపీడనాల ఏర్పాటుకు ఆటంకం కలుగుతుంది. ఈ నెల 16 లేదా 17న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వర్షాలు లేకపోవడంతో ఏపీలో పలు జిల్లాలలో ఎండలు మళ్లీ మండుతున్నాయి. పలు ప్రాంతాల్లో వాతావరణం రెండో వేసవిని తలపిస్తున్నాయి. నిన్న తిరుపతిలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోస్తా జిల్లాల్లో ఎండలతోపాటు వడగాడ్పులు తారెత్తిస్తున్నాయి. మరో రెండు మూడు రోజులు ఇదే పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 25 శాతం వర్షపాతం లోటు నమోదైంది తెలంగ ణలోనూ ఇదే పరిస్థితి.. ఎల్ నినో ప్రభావం తెలంగా ణ రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తుంది. దాదాపు అన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉష్ణోగ్రతలు వేసవిని తలపిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటి నమోదవుతుండడంతో మళ్లీ ఉక్కపోత పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆదివారం ఖమ్మం సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో గరిష్ఠంగా 38 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, హనుమకొండ, భూపాలపల్లి, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట తదితర జిల్లాల్లో 37 నుంచి 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జులై 15 వరకు వాతావరణం ఈ విధంగానే ఉంటుందని తెలిపింది. జులై 19 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా ప్రస్తుతం రుతుపవన ద్రోణి శ్రీగంగానగర్, హిస్సార్, మీరట్, గోరఖ్‌పూర్ మీదుగా దక్షిణ అస్సాం వరకు కొనసాగుతుంది. దీంతో వచ్చే మూడు రోజులు అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో ఉపరితల గాలులు 40 నుంచి 50 కి.మీ వేగంతో, తెలంగాణ జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది

# అధికార దాహం మీదే కేటీఆర్: కేసీఆర్ కుటుంబ అరాచక పాలనపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ మరియు సోనియా గాంధీ గారు అని స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో కుటుంబ సమేతంగా సోనియా గాంధీ గారి నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు చెప్పిన విషయాన్ని కేటీఆర్ మరిచిపోయారా అని ఆయన ప్రశ్నించారు. అమాయక యువత, విద్యార్థుల బలిదానాలకు కారకులు మీరేనని, ఈ విషయంలో మీ బావ హరీశ్ రావును అడిగితే నిజాలు తెలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని, తెలంగాణకు కాపలాదారుగా ఉంటామని చెప్పిన కేసీఆర్ గారు, అధికారం చేజిక్కాక కేవలం తన కుటుంబానికే పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు. రూ. 8 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది మీ పాలనే అని చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు ఆగ్రహం వ్యక్తం చేశారు.



# పబ్‌లో తెల్లవారు జామున భారీ అగ్ని ప్రమాదం.. 27 మంది ఆహుతి

థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని నా లాడ్‌ప్రావో పబ్‌లో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో కనీసం 27 మంది మృతి చెందగా, పలువురు గాయపడి ఆసుపత్రులకు తరలించబడ్డారు. వేదిక సమీపంలోని సర్క్యూట్ బ్రేకర్ నుంచి పొగ రావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి, అనంతరం పేలుడు సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సుమారు అరగంటపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.బ్యాంకాక్, జులై 13: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో సోమవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బ్యాంకాక్‌లోని ఒక పబ్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 27 మంది మృతి చెందారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేలోపే ఈ విషాదం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. బ్యాంకాక్ ఉత్తర భాగంలోని నా లాడ్‌ప్రావో (చీు ఝుఎజూతీుశీ) పబ్‌లో భారీ మంటలు చెలరేగడం, ప్రధాన ద్వారం నుంచి దట్టమైన పొగ వెలువడడం వీడియోలో కనిపించింది. మందపాటి నల్లటి పొగ ఆకాశంలోకి ఎగసిపడుతుండగా, పబ్‌లోని జనాలు అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన దృశ్యాలు వీడియోలో నమోదయ్యాయి. అర్ధరాత్రి సమయంలో ఈ అగ్నిప్రమాదం గురించి తమకు సమాచారం అందిందని అక్కడి పోలీసులు తెలిపారు. థాయ్‌లాండ్ ప్రధాన మంత్రి అనుతిన్ చార్న్‌విరాకుల్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు. అనంతరం ప్రధాన మంత్రి అనుటిన్ చార్న్విరాకుల్ ఘటనాస్థలిలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ప్రమాదంలో 27 మంది మరణించారని, గాయపడిన పలువురిని ఆసుపత్రులకు తరలించినట్లు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. పబ్‌లో ప్రదర్శన ఇస్తున్న ఎబంఅఎఖుఅ తెలిపిన వివరాల ప్రకారం స్టేజ్ సమీపంలోని ఒక సర్క్యూట్ బ్రేకర్ నుంచి పొగ రావడం గమనించిన కొద్దిసేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, అనంతరం ఒక పేలుడు శబ్దం వినిపించిందని, వెంటనే దట్టమైన పొగ పబ్ అంతటా వ్యాపించిందని చెప్పారు. మృతుల్లో చాలామంది పబ్ వెనుక భాగంలోని మరుగుదొడ్లలో (రెస్ట్‌రూమ్‌లలో) కనిపించారని అనుటిన్ తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సుమారు అరగంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదం అనంతరం తీసిన ఫోటోల్లో కాలిపోయిన టేబుళ్లు, కుర్చీలు, పబ్ అంతర్గత భాగం తీవ్రంగా దెబ్బతిన్నట్లు కనిపించింది. ఇలాంటి విషాదకర ఘటనలు థాయ్‌లాండ్‌లో గతంలో కూడా చోటుచేసుకున్నాయి. 2022లో దేశ తూర్పు ప్రాంతంలోని ఒక మ్యూజిక్ పబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 14 మంది మరణించారు. అలాగే, 2009 జనవరి 1న నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బ్యాంకాక్‌లోని సాంటికా నైట్‌క్లబ్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 66 మంది మరణించగా, 200 మందికి పైగా గాయపడ్డారు. ఆ ప్రమాదం ఇండోర్ ఫైర్‌వర్క్ ప్రదర్శన కారణంగా సంభవించినట్లు అప్పట్లో భావించారు.



# రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో జల ద్వారా జలహారతి కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్



**భీమవరం బ్యూరో చీఫ్ జూలై 13 నంది పత్రిక** , రాష్ట్రంలో జల ద్వారా జల హారతి కార్యక్ర మాలను ఉద్యమ స్ఫూర్తితో చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి. నారాచంద్రబాబు నాయుడు అధికారు లను ఆదేశించారు. సోమవారం అమరా వతి సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో జల ధార జలహారతి కార్యక్ర మాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. రాష్ట్రంలో జలధార జలహారతి కార్యక్రమాలు చేపట్టి రేపటికి వంద రోజులు పూర్తి అవుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో జలధార జలహారతి కార్యక్రమం క్రింద చేపట్టిన పనులు పూర్తి చేశారని చెప్పారు. జల ద్వారా జల హారతి కార్యక్ర మంక్రింద చేపట్టిన పనులన్నీటిని కూడా నీటిని నిలువ చేసుకుని భూగర్భ జలాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.వి.బి.బి. రామ్ జీ పదము క్రింద ఇతర నిధులను అనుసంధానం చేసుకొని జల ధార జలహారతి కార్యక్ర మాలు ముమ్మరంగా చేపట్టాలని ఆయన చెప్పారు. జలధార జల హారతి కార్యక్ర మాన్ని జిల్లా కలెక్టర్లు బాగా చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కలెక్టర్లను అభినందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పశ్చిమగోదావరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి,డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పారావు, ఇరిగేషన్ డి.ఇ వెంకటేశ్వర రావు, గ్రౌండ్ వాటర్ డి.డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంలో సీఎం చంద్రబాబును కలిసిన చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్



**పోలవరం బ్యూరో చీఫ్ జూలై 13 నంది పత్రిక** సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించడానికి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి 3 ప్రధాన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు విద్య చింతలపూడిలో ఒక నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు .మహిళా విద్య బాలికల కోసం రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు మౌలిక సదుపాయాలు నియోజకవర్గంలోని 3 ముఖ్యమైన వంతెనలైన పట్టినపాలెం, బైనేరు, గుండేరు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు సీఎం పర్యటన ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగిందని ఆయన తెలిపారు.

# ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న పెనుగొండ నియోజకవర్గ టిడిపి పరిశీలకులు డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు

## రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతోసుఖంగా ఉండాలి డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు



**అనంతపురం బ్యూరో చీఫ్ జూలై 13 నంది పత్రిక** పెనుగొండ పట్టణంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ముక్తేశ్వర స్వామిని పెనుగొండ నియోజకవర్గ టిడిపి పరిశీలకులు డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ స్వామి వారిని దర్శించుకున్నారు. సోమవారం నాడు శ్రీ ముక్తేశ్వర స్వామి ఆలయం చేరుకోగానే ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న వారికి ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మంచి పరిపాలన అందిస్తున్నదని రాష్ట్రంలో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ప్రార్థించామన్నారు. అలాగే పెనుగొండ నియోజకవర్గంలో సర్ ప్రోగ్రాం దాదాపు 94 శాతం ఓటర్ నమోదు అయిందన్నారు. టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పుట్టపర్తి ప్రశాంతి నిలయాన్ని సందర్శించిన డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు

## డాక్టర్ గోగి శెట్టి నరసింహారావు సన్మానించిన ప్రశాంత నిలయం చీఫ్ రత్నాకర్



**పుట్టపర్తి బ్యూరో చీఫ్ జూలై 13 నంది పత్రిక** శ్రీ సత్య సాయి జిల్లాలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక నిలయం పుట్టపర్తి ప్రశాంతి నిలయాన్ని టిడిపి పెనుగొండ నియోజకవర్గం పరిశీలకులు డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు పట్టణ టిడిపి కన్వీనర్ రాములు యాదవ్ పట్టణ టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం సందర్శించారు. సోమవారం నాడు శ్రీ సత్య సాయి బాబా ప్రధాన ఆశ్రమం ప్రశాంతి నిలయం చేరుకున్న వారికి ప్రశాంతి నిలయం చీఫ్ రత్నాకర్ తో కలిసి శ్రీ సత్య సాయి బాబా స్వామివారిని సమాధిని దర్శించుకున్నారు. అనంతరం ఆధ్యాత్మిక మ్యూజియం ప్లానుటోరియం ఆసుపత్రి ధ్యాన వృక్షం మొదలైన ముఖ్య ప్రదేశాలను సందర్శించారు .అనంతరం డాక్టర్ గోగిశెట్టి నరసింహారావును ప్రశాంతి నిలయం చీఫ్ రత్నాకర్ శాలువాతో ఘనంగా సన్మానించారు తరువాత వారు కలిసి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గోగిశెట్టి మాట్లాడుతూ ప్రశాంతి నిలయం అంటే అత్యున్నత శాంతికి నిలయం అని అర్థం అన్నారు స్వామివారి సమాధిని సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com